

జిల్లాలో నీటి తీరువా వసూళ్లు నిలిచిపోవడంతో ఈ ఏడాది కాలువలకు మరమ్మతు పనులు జరిగే అవకాశం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయాల ద్వారా నీటితీరువాను కట్టించుకునే పద్ధతిని ప్రవేశపెట్టగా, ప్రస్తుతం అక్కడ సర్వర్లు పనిచేయడంలేదు. దీంతో రైతుల నుంచి నీటి తీరువా కట్టించుకోవడం ఆపేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా రూ.41.96 కోట్లకు బకాయిలు పేరుకున్నాయి. నీటి తీరువా వసూలును బట్టే కాలువల నిర్వహణ(ఓఅండ్ఎం) పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. నీటి తీరువా వసూళ్లు నిలిచిన నేపథ్యంలో ఈ ఏడాది కూడా పంట కాలువ కష్టాలు రైతులను వెంటాడనున్నాయి.

కాలువలు కడగండ్లు

సర్వర్ పనిచేయక నిలిచిన నీటి తీరువా వసూళ్లు

జిల్లాలో పేరుకుపోయిన రూ.41.96 కోట్ల బకాయిలు

- నీటి తీరువా నగదే కాలువల నిర్వహణకు కేటాయించే అవకాశం
- వైసీపీ ప్రభుత్వంలో అరకొరగానే నిధుల కేటాయింపులు

కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు



మరమ్మతులకు నోచుకోని రామరాజుపాలెం కాలువ



వర్షాలు కురిసిన సమయంలో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న బందరు కాలువ(ఫైల్)

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని శివారు ప్రాంతాల్లో ఆలస్యంగా వరినాట్లు వేశారు. ఆ పైరును కాపాడేందుకు, వేసవిలో తీర ప్రాంతంలోని 376 తాగునీటి చెరువులను నిపేందుకు ఇంకా కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీ శివరాత్రి తర్వాత కాలువలకు సాగునీటి విడుదలను నిలిపివేస్తామని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. కాలువలకు నీటి విడుదలను నిలిపివేస్తే వేసవిలో కాలువల మరమ్మతు పనులు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇటీవల కలెక్టర్ నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి కాలువల మరమ్మతు పనులు చేసేందుకు అంచనాలు తయారు చేసి ఈ నెల మొదటి వారంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

నీటి తీరువా బకాయిలు రూ.41.96 కోట్లు

జిల్లాలో 1431, 1432 ఫసలీలకు సంబంధించి నీటి తీరువా రూ.41.96 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మొత్తం 4,00,471 నీటితీరువా ఖాతాలు ఉన్నాయి. 1431 ఫసలీకి సంబంధించి రూ.18.4 కోట్లు, 1432 ఫసలీకి సంబంధించి రూ.23.55 కోట్లు నీటి తీరువా పెండింగ్‌లో ఉంది. నీటి తీరువాను సకాలంలో కట్టించుకోకపోవడంతో రైతులు చెల్లించాల్సిన నగదుకు ఆరుశాతం వడ్డీతో కలిపి మరీ వసూలు చేస్తున్నారు. ధాన్యం నగదు చేతికందే సమయంలో నీటితీరువాను చెల్లించేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం నీటితీరువా వసూలుకు సంబంధించిన సర్వర్ పనిచేయడం లేదంటూ మిగతా 6లో..

సాగునీటి సంఘాల ద్వారా ప్రతిపాదనలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగునీటి సంఘాలు ఏర్పడ్డాయి. వీటి పర్యవేక్షణలో ఈ ఏడాది కృష్ణాడెల్టాలో సాగునీటి కాలువలు, డ్రైనేజీల మరమ్మతు పనులు పూర్తి స్థాయిలో చేయాలనే ఉద్దేశ్యంతో పనులకు సంబంధించిన అంచనాలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో సాగునీటి సంఘాల అధ్యక్షులు కాలువల పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేయగా, మరికొన్ని పనులకు అంచనాలు రూపొందిస్తున్నారు. దివిసీమ ప్రాంతంలోని కేఈబీ కాలువ పరిధిలో 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు సక్రమంగా అందించేందుకు, డ్రైనేజీలకు మరమ్మతులు చేసేందుకు 463 పనులను రూ.330 కోట్ల అంచనాలతో చేయాలని సాగునీటి సంఘాల ద్వారా ప్రతిపాదనలు వెళ్లాయి. మచిలీపట్నం డివిజన్ పరిధిలోనూ కాలువల నిర్వహణ పనులకు అంచనాలు రూపొందిస్తున్నారు. కృష్ణాడెల్టాలో 13.08 లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగుతుంది. కేఈబీ, బందరు, రైవస్ కాలువ, రామరాజుపాలెం కాలువ, బంటుమిల్లి కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల సాగునీటి సంఘాల ద్వారా రూ.20 లక్షల వరకు కాలువల నిర్వహణ పనులను నామినేషన్ పద్ధతిన కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదనల్లో కొద్దిపాటి మార్పులు చేసి రూ.10లక్షల వరకు పనులను నామినేషన్ పద్ధతిన సాగునీటి సంఘాల ద్వారా చేయించేందుకు సూచనప్రాయంగా ప్రభుత్వం అంగీకరించింది.

చురుగ్గా సాగుతున్న అన్నదాన సత్రం పనులు



చకచకా

దుర్గగుడి అభివృద్ధి పనులు వేగవంతం

రెండు, మూడు నెలల్లో కీలక పనులు పూర్తి

(ఇంద్రకీలాద్రి, ఆంధ్రజ్యోతి) : దుర్గగుడి మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ మాస్టర్ ప్లాన్‌లో అన్నదాన భవనం, లడ్డూ ప్రసాదం తయారీ (పోటు) భవనం, కొండ పైన యాగశాల, పూజా మండపాలు, కనకదుర్గానగర్‌లో ఎలివేటెడ్ క్యూలు, ఘాట్‌రోడ్డులో కొండకు సుమారు 260 మీటర్ల షాక్ క్రీటింగ్‌తో పాటు ఘాట్‌రోడ్డుకు సమాంతరంగా కనకదుర్గానగర్‌లో సుమారు రూ.40 కోట్లతో జీప్లస్10 మల్టీ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, ఇంకా పలు అభివృద్ధి పనులు ఉన్నాయి. ఇప్పటికే కొండపైన సుమారు రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్లతో యాగశాల, సుమారు రూ.2.5 కోట్లతో పూజా మండపాల భవనం నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ అభివృద్ధి పనులు రెండు, మూడు నెలల్లో పూర్తికానున్నాయి. శివాలయం మెట్ల పక్కన అన్నదాన భవన సముదాయం, మహామండపం ఎదురుగా లడ్డూ ప్రసాదం తయారీ భవన సముదాయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రెండు భవన సముదాయాలను దసరాలోపు పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావటానికి చర్యలు తీసుకుంటున్నారు. దేవదాయ శాఖ కమిషనర్, దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్, పశ్చిమ ఎమ్మెల్యే మిగతా 6లో..



నిర్మాణంలో యాగశాల

బర్డ్‌ఫ్లూ ఆందోళన

ఎ.కొండూరు తండాలో 3 వేల కోళ్లు మృతి

అధికారులకు సమాచారం ఇచ్చిన పౌల్ట్రీ యజమాని

- మృతిచెందిన కోళ్ల పూడ్చివేత
- బతికున్నవాటి రక్త నమూనాలు సేకరణ



మృతి చెందిన కోళ్లను సంచుల్లో నింపిన యజమాని

ఎ.కొండూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం రేగుతోంది. గంపలగూడెం ఉదంతం మరవక ముందే.. ఏ.కొండూరు మండలంలోని ఓ పౌల్ట్రీ ఫారంలో 3 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామ శివారున ఉన్న దీప్లానగర్ తండాలోని హనుమాన్ పౌల్ట్రీ ఫారంలో బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకి 3 వేల కోళ్లు మృతిచెందాయి. ఈ ఫారాన్ని కొంతకాలం కిందటే ఏర్పాటు చేశారు. కోడిపిల్లలను తీసుకొచ్చి పెంచుతున్నారు. ప్రస్తుతం ఫారంలో 3 వేల కోళ్లు ఉన్నాయి. రెండు రోజులుగా కొన్ని కోళ్లు అనారోగ్యానికి గురై మృతిచెందుతుండగా, సోమవారం ఒక్కసారిగా 1,500 కోళ్లు మృతిచెందాయి. దీంతో పౌల్ట్రీ యాజమాని.. పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. పశుసంవర్ధక శాఖ ఏడీ రామారావు, అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ భరత్.. వచ్చి పౌల్ట్రీని పరిశీలించారు. చనిపోయిన కోళ్లను వేరు చేసి సమీపంలో ఓ గోతిలో పూడ్చి పెట్టాలని యాజమానికి ఆదేశాలు జారీ చేశారు. విజయవాడ నుంచి వైరాలజీ సిబ్బందిని పిలిపించారు. వారు బతికి ఉన్న కోళ్ల రక్త నమూనాలు సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శాంపిళ్లను భోపాల్‌లోని వ్యాధి నిర్ధారణ కేంద్రానికి పంపుతున్నామని, మూడు రోజుల తరువాత నివేదిక వస్తుందన్నారు. కాగా, ఆదివారం చీమలపాడు, ఎ.కొండూరు, కంభంపాడు గ్రామాల్లో చికెన్, చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. ఈ ఘటనతో చికెన్ తిన్నవారు ఆందోళన చెందుతున్నారు.

నగరంలో ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీగా ఉన్న లోటస్ ల్యాండ్‌మార్క్‌లో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూమి ఉందా? ఆ భూమిని కలుపుకొని లోటస్‌లో నిర్మాణాలు చేపట్టారా? దేవస్థాన రికార్డుల్లో కనిపించని వివరాలు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. ఓ సామాజిక కార్యకర్త చేసిన ఫిర్యాదుతో దుర్గగుడి అధికారులు కళ్లు తెరిచారు. ఈ అంశం మూడు శాఖల మధ్య దుమారాన్ని రేపుతోంది.

లోటస్ లోగుట్టు..!

లోటస్ ల్యాండ్‌మార్క్‌లో దుర్గగుడి స్థలం ఉందా?

ఓ సామాజిక కార్యకర్త ఫిర్యాదుతో బయటపడుతున్న నిజాలు

- లోటస్‌లో ఆలయ స్థలం ఉందని లేఖ
- రెవెన్యూ రికార్డుల్లోనూ కనిపించిన భూమి
- శ్రీకనకదుర్గ నగరోత్సవం పేరుతో 11.54 ఎకరాలు
- దేవస్థాన రికార్డుల్లో మాత్రం కనిపించని ఆధారాలు
- వివరాల కోసం వీఎంసీకి ఆలయ అధికారుల లేఖ
- అసెస్‌మెంట్ నెంబర్లు ఇచ్చిన వీఎంసీ
- రీసర్వే చేస్తేనే వివరాలు తెలిసే అవకాశం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో ఉన్న లోటస్ ల్యాండ్‌మార్క్‌లో శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూమి ఉందని ఓ సామాజిక కార్యకర్త 2023 డిసెంబరులో అప్పటి కలెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, ఆ భూమిని దేవస్థానానికి చెందేలా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. సదరు లేఖను దేవస్థాన అధికారులకు కూడా అందజేశారు. దీనిపై దేవస్థానం అధికారులు.. రెవెన్యూ శాఖను సంప్రదించారు. ప్రస్తుతం లోటస్ సర్వే నెంబర్లలో దేవస్థానానికి చెందిన భూమి ఉందో లేదో నిర్ధారించాలని కోరారు. రెవెన్యూ సర్వే రికార్డులను పరిశీలించగా, అందులో శ్రీకనకదుర్గ నగరోత్సవం పేరుతో 11.54 ఎకరాలు ఉన్నట్లు రాసి ఉంది. దీనికి సంబంధించిన టైటిల్ డీడ్లు గానీ, డాక్యుమెంట్లు గానీ దేవస్థాన అధికారుల వద్ద లేవు.

దేవస్థాన రికార్డులో వివరాలు ఏమైనట్లు?

రాష్ట్రంలో ప్రతి దేవస్థానానికి ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయి? ఎంతెంత ఉన్నాయి? అనే వివరాలను నమోదు చేయడానికి ఏపీ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ చట్టంలోని సెక్షన్ 43 ప్రకారం ఓ రికార్డు ఉంటుంది. ఈ రికార్డుల్లో సంబంధిత దేవస్థానం కొనుగోలు వస్తువులు, వేలం వేసిన పరికరాలు, నిర్మించిన భవనాలు, తొలగించిన భవనాలు.. ఇలా ప్రతి అంశాన్నీ నమోదు చేయాలి. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని 43వ రికార్డు బుక్‌లో మాత్రం రెవెన్యూ సర్వే రికార్డుల్లో ఉన్న వివరాలు కనిపించలేదు. 2010 వరకు మాత్రమే వివరాలున్నాయి. తర్వాత దీనిలో ఎటువంటి అంశాలను నమోదు చేయలేదు. కొత్త అంశాలను నమోదు చేయాలంటే కచ్చితంగా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అనుమతి తీసుకోవాలి. రెవెన్యూ సర్వే రికార్డు (ఆర్ఎస్ఆర్)లో ఉన్న వివరాలను 43 రికార్డులో నమోదు చేయడానికి అనుమతి ఇవ్వాలని అధికారులు దేవదాయ శాఖ సహాయ కమిషనర్‌ను లేఖ రాశారు. అనుమతి రావడంతో కొద్ది నెలల క్రితం ఆర్ఎస్ఆర్‌లో ఉన్న 11.54 ఎకరాల వివరాలను 43 రికార్డులోకి ఎక్కించారు.

ఇదీ లోటస్ చరిత్ర

ప్రస్తుతం లోటస్ ల్యాండ్‌మార్క్ ఉన్న స్థలంలో ఒకప్పుడు సిమెంట్ తయారీ కర్మాగారం ఉండేది. నష్టాలు రావడందో దాన్ని మూసేశారు. తర్వాత నలుగురు భాగస్వాములు కలిసి ఈ స్థలాన్ని కొనుగోలు చేసి వెంచర్లు వేశారు. 14-15 ఏళ్ల క్రితం ఇక్కడ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఇది ఇప్పుడు నగరంలో ఓ ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీగా తయారైంది. సుమారు 50 ఎకరాల్లో విస్తరించి ఉన్నట్టు తెలుస్తోంది.

పూర్తి వివరాలివ్వండి

లోటస్‌లో దేవస్థానానికి చెందిన భూమి ఎంతమేర ఉంది? ఏయే సర్వే నెంబర్లలో ఎంతెంత ఆక్రమణలో ఉంది.. అనే వివరాలను తేల్చడానికి దేవస్థాన అధికారులు సిద్ధమవుతున్నారు. రెవెన్యూ సర్వే మిగతా 6లో..

సమస్యల సంగమం!

- అపరిశుభ్రంగా పవిత్ర సంగమ ప్రాంతం
- మహా శివరాత్రికైనా బాగుచేయాలని అధికారులకు భక్తుల విజ్ఞప్తి 8లో



వేడి నీళ్ల కాలువ పక్కనే నిలువునా చీలిపోయిన రహదారి



8లో

పుణ్యస్నానాల పుష్కరఘాట్‌ను రహదారిగా మార్చేశారు!

వ్యాపార అవసరాల కోసం భక్తుల మనోభావాలతో చెలగాటం



దుర్గమ్మ విధుల్లో ఇష్టారాజ్యం!

గైర్హాజరవుతున్న భజంత్రీలు, పంచవాయిద్య కారులు

- వీఐపీలు వచ్చినా అందుబాటులో ఉండని వైనం
- పలువురికి నోటీసులు? 6లో

నేడు వీరమ్మ శిడిబండి ఉత్సవం



ఉయ్యూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లలో అంత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న శిడిబండి ఉత్సవం 11వ రోజు మంగళవారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుక తిలకించేందుకు భక్తులు వేలాదిగా ఉయ్యూరు తరలిరానున్నారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఓ దళిత కుటుంబానికి చెందిన వివాహానికి సిద్ధంగా ఉన్న యువకుడి (పెళ్లి కొడుకు)ని శిడిబండికి కట్టిన ఉట్టి బుట్టలో కూర్చుండబెట్టి మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ ఊయల స్తంభాలు, ఆలయ ప్రదక్షిణ చేసి, అమ్మ వారి దర్శనం చేయిస్తారు. అమ్మవారి తిరునాళ్లలో అత్యంత కీలకమైన ఈ ఘట్టం నిర్వహించేందుకు పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.




అంగన్‌వాడీల పోరుబాట

గుడివాడలోని మాత,శిశు సంక్షేమ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కనీస వేతనం అమలు చేయాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని, మినీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీ.వో విడుదల చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు పోరుబాట పట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సోమవారం ధర్నాలు నిర్వహించారు. తమ డిమాండ్లపై అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

ఆర్టీసీకి 'టోల్' నష్టం రూ.2 కోట్లు!

- ఎన్టీఆర్ , కృష్ణా జిల్లాల ఆర్టీసీ అధికారుల ఘనకార్యం
- బస్సులకు లోకల్ రిజిస్ట్రేషన్ చేయకుండా తాత్సారం
- టోల్‌ప్లాజాల వద్ద కోల్పోయిన రాయితీలు
- జిల్లాల పునర్విభజన నుంచి ఇప్పటి వరకు రూ. 2 కోట్ల నష్టం
- నిగ్గు తేల్చిన ఆడిట్ .. ఉన్నతాధికారులకు రిపోర్టు



6లో

'పెద్దవరం' ఇండస్ట్రియల్ పార్క్(ఐపీ) పునరుజ్జీవనం దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయి. నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఉండాలన్న ఉద్దేశ్యంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నందిగామ మండలంలోని పెద్దవరం గ్రామంలో అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసి ఏపీఐఐసీకి భూములు కేటాయించింది. ఇండస్ట్రియల్ పార్క్ వచ్చినా తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు అవాంతరాలు తలెత్తాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక ప్రోత్సాహకాలు, ఇండస్ట్రియల్ పార్క్‌ల విస్తరణ లేకపోవటంతో అభివృద్ధికి నోచని 'పెద్దవరం' ఇండస్ట్రియల్ పార్క్‌కు మరల కూటమి ప్రభుత్వం రాకతో మహర్దశ పట్టింది. పెద్దవరం ఇండస్ట్రియల్ పార్క్‌పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

పరిశ్రమలకు పెద్దవరం

- పరిశ్రమల ఏర్పాటు దిశగా చర్యలు
- రంగంలోకి ఏపీఐఐసీ అధికారులు
- నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల ప్రజలకు విస్తృత ఉపాధి అవకాశాలు



ఇండస్ట్రియల్ పార్క్‌కు పునర్వైభవం

పరిశ్రమల స్థాపన కోసం అభివృద్ధి చేసిన ఏపీఐఐసీ భూములు

(నందిగామ, ఆంధ్రజ్యోతి)

పరిశ్రమల స్థాపనకు అవసరమైన సకల హంగులతో కూడిన ఏపీఐఐసీ 'పెద్దవరం' ఇండస్ట్రియల్ పార్క్ భూములపై ప్రభుత్వం దృష్టి సారించింది. పెద్దవరం ఇండస్ట్రియల్ పార్క్‌ను తిరిగి అభివృద్ధి పరిచేందుకు ఏపీఐఐసీ ముందుకు వచ్చింది. నందిగామ మండలం 'పెద్దవరం' గ్రామంలో 1170 ఎకరాల మైన్యూర్ సర్క్యూట్(ఎంసీ) భూములను గుర్తించిన గత టీడీపీ ప్రభుత్వం 2016లో ఆభూమిని ఏపీఐఐసీకి అప్పగించాలని నిర్ణయించింది. దీంతో పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యారు. చంద్రబాబు నిర్ణయంతో ఈ ప్రాంత ప్రజలు సంబర పడ్డారు. ఉద్యోగ, ఉపాధి రంగాలతో పాటు వ్యవసాయం, వ్యాపార రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని అందరూ భావించారు. అప్పటి వరకు ఎంసీ భూములుగా ఉన్న సదరు భూమికి సబ్ డివిజన్ చేసి సర్వే నెంబర్లు 669, 667, 1-4గా నిర్ణయించింది. తొలిదశగా 515.7 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి అప్పగించింది. సుమారు యాభై కోట్లతో పరిశ్రమల స్థాపనకు అనువుగా రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించారు. కొండలు, గుట్టలుగా ఉన్న భూమిని సుందరంగా తీర్చిదిద్దారు. గజం రెండు వేల రూపాయలు నిర్ధారించిన ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించింది. సదరు భూములు పరిశీలించిన పారిశ్రామిక వేత్తలు సైతం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చారు. ఈ తరుణంలో ఎన్నికలు జరగడం, రాష్ట్రంలో జగన్ అధికారంలోకి రావడంతో పరిశ్రమల స్థాపనకు ఆటంకం ఏర్పడింది.

ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి

ప్రభుత్వం చొరవ తీసుకొని ఈ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజల జీవనప్రమాణాలు పెరగనున్నాయి. ప్రస్తుతం రెండు పరిశ్రమలు ఉంటేనే పెద్దవరం ప్రాంతంలో ప్రత్యక్ష, పరోక్షంగా వెయ్యిమందికి ఉపాధి లభించింది. ఏపీఐఐసీ భూముల్లో కనీసం వంద పరిశ్రమలు ఏర్పాటైతే లక్షలమందికి జీవనాధారం ఏర్పడుతుంది. చంద్రబాబు పాలనలోనే అది సాధ్యమని ప్రజలు నమ్మకంతో ఉన్నారు. ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

నిలిచిపోయిన బల్క్‌డ్రగ్ పరిశ్రమ

కరోనా సమయంలో భారీగా బల్క్ డ్రగ్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రభుత్వం నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాలను ఎంచుకుంది. దీంతో వందలసంఖ్యలో పారిశ్రామిక వేత్తలు దరఖాస్తులు అందజేశారు. అప్పటికే ఏపీఐఐసీ భూములు సకల వసతులతో సిద్ధంగా ఉన్నా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. పరిశ్రమలకు దరఖాస్తు చేసినా భూములు కేటాయించలేదు. దీంతో కొంతమంది ప్రైవేటు వ్యవసాయ భూములు కొనుగోలు చేసుకున్నారు. సకాలంలో సదరు భూములు కన్వర్షన్ కాకపోవడంతో పాటు ప్రభుత్వం నుంచి ఎదురౌతున్న ఇబ్బందులతో పరిశ్రమ స్థాపనలో జాప్యం ఏర్పడింది.

జమీందారీ వారసుల న్యాయపోరాటం

ఏపీఐఐసీ భూములు ఉన్న 'పెద్దవరం' గ్రామం ముక్త్యాల జమీ కింద ఉండేది. 1956లో ఇనామ్ అబాలిషన్ చట్టం అమలులోకి వచ్చిన తరువాత గ్రామంతో పాటు జమీ అధీనంలో ఉన్న సదరు 12 వందల ఎకరాల భూమి ప్రభుత్వ అధీనంలోకి వచ్చింది. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న సదరు భూమిని గత చంద్రబాబు ప్రభుత్వం ఏపీఐఐసీకి అప్పగించింది. దీంతో జమిందారు వారసులు కోర్టును ఆశ్రయించారు. ఇనాం అబాలిషన్ చట్టం ప్రకారం ప్రభుత్వం సాధీనం చేసుకొనే భూమిలో 1-3వ వంతు భూమి తమకు వస్తుందని వారు వాదిస్తున్నట్టు తెలిసింది.

సాగు రైతుకు అందని పరిహారం

ఏపీఐఐసీ స్వాధీనం చేసుకున్న భూమిలో సుమారు ఎనభై మంది రైతులు 120 ఎకరాల వరకూ సాగు చేసుకుంటున్నారు. ఏళ్ల తరబడి సాగులో ఉంటున్న తమకు న్యాయం చేయాలని వారు కోరడంతో అంగీకరించిన ప్రభుత్వం ఎకరాలనికి రూ.6 లక్షల చొప్పునపరిహారం నిర్ణయించింది. ఆ తరుణంలో గ్రామస్థులు పెద్దఎత్తున తాము కూడా సాగులో ఉన్నామంటూ ఆందోళనకు దిగారు. దీనిపై ప్రభుత్వం నిజనిర్ధారణ కమిటీ వేసింది. కమిటీ నివేదిక అందేలోగా ప్రభుత్వం మారింది. దీంతో నిజంగా సాగు చేస్తున్న రైతులకు కూడా పరిహారం అందలేదు. తిరిగి చంద్రబాబు ప్రభుత్వం రావడంతో పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

అనువైన ప్రదేశం

ఏపీఐఐసీ అభివృద్ధి చేసిన పెద్దవరం భూములు పరిశ్రమల స్థాపనకు పెద్ద వరమే అని చెప్పాలి. కేవలం 15 కిలోమీటర్లలోపే జాతీయ రహదారి.. దీనికి తోడు జాతీయ రహదారుల సంస్థ ఇటీవల ప్రకటించిన గ్రీన్‌ఫీల్డ్ హైవే కూడా ఈ ప్రాంతం సమీపంలోనే ఉంది. కిలోమీటరు దూరంలోనే కృష్ణానది.. పరిశ్రమలకు అవసరమైన నీరు అక్కడ పుష్కలంగా లభిస్తుంది. వ్యవసాయాధారిత పరిశ్రమలకు ముడిసరుకు కూడా ఇక్కడే లభ్యమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో లిక్కర్, ఇథనాల్ పరిశ్రమలను స్థాపించారు. ఇథనాల్ పరిశ్రమ ఈ ఏడాది నుంచి ఉత్పత్తులు ప్రారంభించనుంది. ఈ పరిశ్రమకు ప్రధానమైన ముడిసరుకు బియ్యం, మొక్కజొన్నలు ఇక్కడే లభ్యమౌతున్నాయి. దీనివల్ల పరిశ్రమకు, రైతులకు ఇద్దరికీ మేలు జరిగే అవకాశం ఉంటుంది.

దుర్గమ్మ విధుల్లో ఇష్టారాజ్యం!

- గైర్హాజరవుతున్న భజంత్రీలు, పంచవాయిద్యకారులు
- వీఐపీలు వచ్చినా అందుబాటులో ఉండని వైనం
- పలువురికి నోటీసులు?



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ప్రధాన ఆలయం కవాట ఉద్ఘాటనం చేసినప్పటి నుంచి (తలుపులు తెరచినప్పటి నుంచి) తిరిగి రాత్రి కవాట బంధనం చేసే వరకు దేవస్థాన భజంత్రీలు, పంచ వాయిద్యకారులు విధుల్లో ఉండటంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అమ్మవారి దర్శనానికి వీఐపీలు వచ్చిన సమయంలో వారు అందుబాటులో వలన ఆలయ ఉద్యోగులు, అర్చకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొందరికి ఆలయ అధికారి నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. దేవస్థానంలో 25 మంది పర్మినెంట్ భజంత్రీలు, ఐదుగురు ఔట్‌సోర్సింగ్ పంచ వాయిద్యకారులు పనిచేస్తున్నారు. అయితే కొందరు విధులకు హాజరై సంతకం చేసి డ్యూటీ పూర్తిగా నిర్వహించకుండా మధ్యలోనే వెళ్లిపోతున్నారని, మరికొందరు విధులకు రావటం లేదని, కొందరు ప్రైవేటు కార్యక్రమాలకు వెళుతున్నట్టు ఆలయంలోని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇటీవల అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఓ వీఐపీకి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికినప్పుడు భజంత్రీలు అందుబాటులో లేక ఇబ్బందులకు గురవడంతో ఆరోజు విధుల్లో ఉన్న ఆలయ ఉద్యోగి గైర్హాజరైన భజంత్రీలకు నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. భజంత్రీలు, పంచ వాయిద్యకారులపై అధికారుల పర్యవేక్షణ కొరవడటం వలన వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తు డ్యూటీలకు హాజరవుతున్నారని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

దేవస్థానం షాపుల అద్దె బకాయిల వసూలుకు చర్యలు

- రెండు రోజుల్లో రూ. 30 లక్షలు వసూలు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 17 (ఆంధ్ర జ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం షాపుల అద్దె బకాయిల వసూలుకు చర్యలు చేపట్టారు. పేరుకుపోయిన మొండి బకాయిలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం మేరకు అధికారులు స్పందించారు. గత రెండు రోజుల నుంచి అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రూ. 30 లక్షలు వరకు వసూలు చేశారు. దేవస్థానం నుంచి షాపులను లీజుకు తీసుకున్న యజమానులు పాత బకాయిలు సుమారు రూ 1.20 కోట్లు, ప్రస్తుత వ్యాపారస్తులు రూ. 30 లక్షలు బకాయిపడ్డారు. నోటీసులు ఇచ్చినప్పటికీ తాత్సారం చేస్తూ బకాయిలు చెల్లించడం లేదు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన దేవదాయ కమిషనర్, దుర్గగుడి ఈవో కె.రామచంద్రమోహన్ సంబంధిత అధికారులు, ఉద్యోగులపై సీరియస్ అయ్యారు. వెంటనే బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. ఆ విభాగం ఏఈవో దుర్గారావు, సూపరింటెండెంట్ డీవీవీ సత్యనారాయణ, సిబ్బంది బకాయిలు చెల్లించాలని లీజుదారులపై ఒత్తిడి పెంచారు. దీంతో సుమారు రూ.30 లక్షలు వసూలైంది. మిగిలిన మొత్తం నెలాఖరు లేదా, మార్చినెలలో వసూలు చేస్తామని ఏఈవో తెలిపారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



జీజీహెచ్ వద్ద రోదిస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు

ప్రాణాలతో చెలగాటమా!

- చికిత్స పొందుతూ మహిళ మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే.. అంటూ బంధువుల రోదనలు

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పేదల ప్రాణాలతో వైద్యులు చెలగాటమాడుతున్నారని, వైద్యం కోసం వెళ్లిన వారు క్షేమంగా ఇంటికి వస్తారనే ఆశ లేకుండా చేస్తున్నారని, మెరుగైన వైద్య సేవలు దేవుడెరుగు కనీస వైద్య సేవలైనా అందించలేని దయనీయస్థితిలో ప్రభుత్వఆసుపత్రి ఉందని మృతుల బంధువులు బోరున విలపించారు. జి.కొండూరు మండలం కందులపాడు శివారు చేగిరెడ్డిపాడు గ్రామానికి చెందిన వల్లూరు సునీత (30) రెండ్రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను సోమవారం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆమెకు షుగర్ లెవల్స్ అధికంగా ఉండటంతో కంట్రోల్ చేసేందుకు ఇంజక్షన్ ఇచ్చారు. ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించి కోమాలోకి వెళ్లిపోయి మృతి చెందింది. దీంతో వైద్యుల నిర్లక్ష్యం వల్లే సునీత మృతి చెందిందని ఆమె కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. తమ బిడ్డను వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాలు తీశారని ఆమె తల్లి, బంధువులు బోరుమన్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటిండెంట్ ఎ.వెంకటేశ్వరరావును వివరణ కోరగా.. రోగికి షుగర్ లెవల్స్ అధికంగా ఉండటం వల్లే మృతి చెందిందని, ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని.. షుగర్ లెవల్స్ అధికమై నిమోనియాకు దారితీసి రోగి మృతి చెందిందని తెలిపారు.

బర్డ్ ఫ్లూ బఫర్ జోన్‌లు అప్రమత్తం

- 35 గ్రామాల పరిధిలో కట్టుదిట్టమైన బయోసెక్యూరిటీ కీలకం
- 24 గంటల పాటు పర్యవేక్షణ, విస్తృత పారిశుధ్య పనులు చేపట్టండి
- జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గంపలగూడెం మండలంలోని అనుమల్లంకలో కోళ్ల మరణాలకు సంబంధించి బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో పది కిలోమీటర్ల పరిధిలోని 35గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలను కొనసాగించాలని, సమన్వయ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. అనుమల్లంక ఘటన నేపథ్యంలో చేపడుతున్న చర్యలపై సమీక్షించేందుకు కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైసెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ (నిషాద్) నుంచి ఫిబ్రవరి 14న వచ్చిన ఫలితాల్లో హెచ్5ఎన్1 ఏవీఎస్ ఇన్‌ఫ్లూయంజా వైరస్ పాజిటివ్ వచ్చినట్టు పశుసంవర్ధక అధికారులు తెలిపారు. అప్పటికే యుద్ధప్రాతిపదికన భద్రతా చర్యలు తీసుకొన్నట్టు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధాన కేంద్రం (0-1 కి.మీ)తో పాటు అనుమల్లంకకు పది కిలోమీటర్ల పరిధిలోని బఫర్ జోన్‌లో నియంత్రణ చర్యలను పకడ్బందీగా కొనసాగించాలన్నారు. బఫర్ జోన్‌లో చికెన్, గుడ్ల దుకాణాలను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు మూసివుంచాలని స్పష్టం చేశారు. పారిశుధ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని శానిటైజేషన్‌కు స్ప్రేయర్లు, ఫాగర్లను అందుబాటులో వుంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా వుండాలన్నారు. జిల్లాలోని 116 కోళ్ల ఫారాల్లోను 24 గంటలూ నిరంతర పర్యవేక్షణతో పాటు బయో సెక్యూరిటీ చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి చర్యలోను నిర్దిష్ట స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను అనుసరించాలన్నారు. బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బఫర్‌జోన్‌లో ఫీవర్ సర్వేలను నిర్వహించాలని, అవసరమైతే నమూనాలను పరీక్షించాలని, వైద్య, ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. అటవీ ప్రాంతంలో పక్షుల్లో అసహజ మరణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలని అటవీ అధికారులకు కలెక్టర లక్ష్మీశ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీపీవో పి.లావణ్యకుమారి, ఫారెస్ట్ రేంజ్ అధికారి పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలకు మంచి ధర..

ప్రస్తుతం జిల్లాలో అధికంగా సాగవుతూ అధిక దిగుబడి కలిగిన టమాట, క్యాబేజ్, వంగ వంటి కూరగాయలు ధరలు తగ్గిన నేపథ్యంలో రైతులకు సరైన ధరలు లభింపచేసే ప్రక్రియలో భాగంగా కలెక్టర్ లక్ష్మీశ, టోకు వ్యాపారులు, వ్యవసాయ మార్కెటింగ్, ఉద్యానశాఖ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మన ప్రాంతంలో పండుతున్న కూరగాయలకు మంచి ధర కల్పించే ఉద్దేశ్యంతో టమాట, వంగ, క్యాబేజి, పచ్చిమిర్చి, కాప్సికం వంటి కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేయరాదని టోకు వ్యాపారస్తులను ఆదేశించినట్టు తెలిపారు. రైతు బజారుల్లో ఈ ప్రాంతంలో పండే కూరగాయలనే విక్రయించాలని, ఎవరైనా బయట రాష్ట్రాల నుంచి దిగుమతి చేసి అమ్మినట్టు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రైతుబజారు ఎస్టేట్ అధకారులను ఆయన హెచ్చరించారు. రైతులు రైతుబజారుల్లో నేరుగా తమ కూరగాయలను అమ్ముకునే సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీనివాసరావు,లావణ్య, ఎం.దివాకర్, కె.మంగమ్మ, హార్టీకల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలన

ఈనెల 27న ఉమ్మడి కృష్ణా-గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు పోలింగ్ జరగనుందని, పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్ల (సూక్ష్మ పరిశీలకులు) పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్ల శిక్షణా కార్యక్రమం జరిగింది. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని, పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి సాధారణ పరిశీలకులకు నివేదిక అందించాల్సి వుంటుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 112 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు వివరించారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. నిర్దేశించిన తొమ్మిది అంశాలతో పాటు పోలింగ్ సమయంలో ఎదురయ్యే వివిధ అంశాలపై సరైన విధంగా నివేదిక అందించాల్సి వుంటుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌వో, సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం, నోడల్ అధికారి కె.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 78,063 మంది ఓటర్లు

ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని కలెక్టర్ లక్ష్మీశ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్సీ ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలో ఓటర్లు, పోలింగ్ స్టేషన్ లొకేషన్లు, ఆగ్జలరీ పోలింగ్ స్టేషన్లు తదితరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లాలో 78,063 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 45,425 మంది కాగా మహిళలు 32,625 మంది, టీజీ ఓటర్లు 13 మంది ఉన్నట్లు వివరించారు. 11 అనుబంధ పోలింగ్ స్టేషన్లతో సహా మొత్తం 112 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. క్రమంలో కలెక్టరేట్‌లో 0866-2575822 నెంబరుతో కమాండ్ కంట్రోల్ రూం పనిచేస్తోందని, ఉల్లంఘనలపై ఈ నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అభ్యర్థులు అనుమతుల మేరకు ఎన్నికల ప్రటర్లకు ఓటర్‌స్లిప్‌లు పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు.

చకచకా

(5వ పేజీ తరువాయి)

యలమంచిలి సుజనాచౌదరి తరచూ ఈ మాస్టర్ ప్లాన్‌పై సమావేశాలు నిర్వహిస్తున్నారు.

మల్టీ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై కసరత్తు

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో కీలకమైన మల్టీ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై దేవస్థాన అధికారులు కసరత్తు చేస్తున్నారు. దుర్గగుడిని శాశ్వతంగా అభివృద్ధి చేయటానికి వీలుగా మాస్టర్ ప్లాన్‌కు శ్రీకారం చుడుతున్న సంగతి తెలిసిందే. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్న నేపథ్యంలో పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టేందుకు ఈ మల్టీ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై దృష్టిసారించారు. ప్రస్తుతం ఘాట్‌రోడ్డులో కింద నుంచి పైవరకు సుమారు 150 కార్లు, కనకదుర్గానగర్‌లో సుమారు 100 కార్లకు పార్కింగ్ మాత్రమే ఉంది. మిగిలిన కార్లను పార్కింగ్ చేయటానికి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఆలయ అధికారులు కనకదుర్గానగర్‌లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఫలితంగా ఆ ప్రాంతంలోకి వాహనాలను అనుమతించడం లేదు. ఇందుకు ప్రత్యామ్నాయంగా దేవస్థానం అధికారులు విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని వాడుకుంటున్నారు. అయినా వాహనాలు పెద్ద సంఖ్యలో రావటంతో పార్కింగ్‌కు సమస్యగానే ఉంది. ఈ నేపథ్యంలో మల్టీ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయితే పార్కింగ్ సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉంటుంది.

లోటస్ లోగుట్టు..!

(5వ పేజీ తరువాయి)

రికార్డుల్లోని వివరాలను బట్టి తమకు లోటస్ ల్యాండ్‌మార్క్‌కు చెందిన వివరాలు ఇవ్వాలని దేవస్థాన అధికారులు.. వీఎంసీ అధికారులకు లేఖ రాశారు. దీని ప్రకారం ఒక మ్యాప్‌ను వీఎంసీలోని సర్వే, రెవెన్యూ విభాగ అధికారులు చూపించినట్టు తెలిసింది. అసెస్‌మెంట్ నెంబర్లను దేవస్థాన అధికారులకు అందజేశారు. వీఎంసీలోని రెవెన్యూ విభాగం ప్రతి స్థలానికి ఒక అసెస్‌మెంట్ నెంబరు ఇస్తుంది. అందులో ఏమైనా నిర్మాణాలు జరిగాక ఇంటి నెంబరును కేటాయిస్తుంది. లోటస్ ల్యాండ్‌మార్క్‌లో ప్రస్తుతం ఎటుచూసినా భవనాలు కనిపిస్తున్నాయి. అసెస్‌మెంట్ నెంబర్లు ఇచ్చిన వీఎంసీ అధికారులు ఇప్పటివరకు ఇంటి నెంబర్లు ఇవ్వలేదు. ఇంటి నెంబర్లు ఇస్తేనే ఏయే అసెస్‌మెంట్ నెంబర్లలో దేవస్థాన భూమి ఉంది అనేది తెలుస్తుందని దేవస్థాన అధికారులు అభిప్రాయపడుతున్నారు. మళ్లీ సర్వే చేయించాల్సి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

లే అవుట్‌కు అనుమతి ఉంది

అయోధ్యనగర్‌లో ఉన్న లోటస్ ల్యాండ్‌మార్క్ ప్రైవేట్ స్థలంగా మా రికార్డుల్లో ఉంది. దీనికి లే అవుట్ అనుమతులు ఉండటంతో నిర్మాణాలకు అనుమతి ఇచ్చాం. ఇది ప్రభుత్వ భూమి అని తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

- వెంకట ప్రసాద్, చీఫ్ సిటీప్లానర్

వైసీపీకి డాక్టర్ సౌమ్య గుడ్ బై



జగ్గయ్యపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేటకు చెందిన ప్రముఖ డెంటిస్ట్, వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీరమాచినేని సౌమ్య వైసీపీకి రాజీనామా చేస్తూ లేఖను పార్టీ అధ్యక్షుడు జగన్‌కు సోమవారం అందజేశారు. ఆమె జగ్గయ్యపేట అసెంబ్లీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. విజయ శాయిరెడ్డి వర్గానికి చెందిన నేతగా గుర్తింపు పొందారు. ఎన్నికల తర్వాత పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. గతేడాది బుడమేరు వరదల సమయంలో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాంను కలిసి రూ.50వేలు సీఎం సహాయనిధికి అందజేశారు. విజయశాయిరెడ్డి రాజీనామా నేపథ్యంలో సౌమ్య కూడా వ్యక్తిగత కారణాలతో రాజకీయాలకు తాత్కాలికంగా విరామం ఇవ్వాలని పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఏ పార్టీలో చేరే యోచన లేదని చెప్పారు.

ఆర్టీసీకి టోల్ నష్టం రూ.2 కోట్లు!

- ఎన్టీఆర్ , కృష్ణా ఆర్టీసీ అధికారుల ఘనకార్యం
- బస్సులకు లోకల్ రిజిస్ట్రేషన్ చేయకుండా తాత్సారం
- టోల్‌ప్లాజాల వద్ద రాయితీలు కోల్పోయారు
- జిల్లాల పునర్విభజన నుంచి ఇప్పటి వరకు రూ. 2 కోట్ల నష్టం
- నిగ్గు తేల్చిన ఆడిట్ .. ఉన్నతాధికారులకు నివేదిక



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీలో ఒక కండక్టర్ ఒక్క రూపాయి టిక్కెట్ తక్కువ కొడితే అతడ్ని డిపో స్పేర్‌లో పెడతారు.. రోజుల తరబడి విధుల్లోకి తీసుకోరు .. రిమార్కు రాసి ఇంక్రిమెంట్‌ను కట్ చేస్తారు.. అదే ఓ అధికారి ఎంత పెద్ద తప్పు చేసినా చర్యలుండవు! అధికారులు చేసిన తప్పును ఉన్నతాధికారులు కాపుకాస్తారు! ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఆర్టీసీ అధికారులు చేసిన తప్పు వల్ల సంస్థపై రూ2 కోట్ల నష్టం పడింది. ఇది ఆడిట్ తేల్చిన లెక్క! ఆర్టీసీకి నష్టం జరిగిందని ఆడిట్ నిగ్గు తేల్చితే.. ఇప్పటి వరకు ఆ అధికారులపై ఉన్నతాధికారుల చర్యలు లేవు? ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పరిధిలోని పలు బస్సులకు స్థానికంగా రిజిస్ట్రేషన్స్ నిర్వహించకపోవటం వల్ల టోల్‌ప్లాజాల దగ్గర అధికంగా రుసుము కట్టాల్సి వచ్చింది. జిల్లాల పునర్విభజన తర్వాత నుంచి ఇప్పటి వరకు ఆర్టీసీకి టోల్ ప్లాజాల దగ్గర ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వచ్చింది. ఈ నష్టం రూ.2 కోట్లుగా ఆడిట్ తేల్చింది. నష్టంపై ఆర్టీసీ ఎండీకి నివేదిక ఇవ్వటంతో పాటు రెండు జిల్లాల అధికారులకు కూడా కాపీ పంపించినట్టుగా తెలుస్తోంది. ఆర్టీసీలో ఆడిట్ నివేదిక సంచలనంగా మారింది. ఈ నివేదికపై ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది వేచి చూడాల్సి ఉంది. జిల్లాల పునర్విభజన తర్వాత రెండు జిల్లాలకు వేర్వేరుగా ఆర్టీసీ బస్సులను కేటాయించారు. బస్సుల కేటాయింపు నేపథ్యంలో, ఎక్కడికక్కడ స్థానికంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉండగా.. ఆ పని అధికారులు చేయలేదు. దీంతో పాటు కొత్తగా కొనుగోలు చేసిన బస్సులకు కూడా స్థానికంగా ఎక్కడకక్కడ రిజిస్ట్రేషన్ చేయించలేదు. రిజిస్ట్రేషన్ చేయించకుండానే ఆర్టీసీ వాటిని నడుపుతోందన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. బస్సులకు స్థానిక రిజిస్ట్రేషన్ ఉంటే టోల్‌ప్లాజాల దగ్గర అందులో 75 శాతం మాత్రమే ఛార్జీలు చెల్లించటానికి అవకాశం ఉంటుంది. ఆర్టీసీ అధికారులు స్థానికంగా రిజిస్ట్రేషన్ చేయించకపోవటం వల్ల రాయితీ ప్రయోజనాలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. ఈ అంశం ఆడిట్ పరిశీలనలో వెలుగు చూసింది. ఇన్నాళ్లుగా ఆర్టీసీ అధికారులు ఈ విషయాన్ని గుట్టుగా ఉంచారు. ఆడిట్ ఈ అంశంపై సీరియస్‌గా స్పందించింది. ఆర్టీసీకి రూ. 2 కోట్లు నష్టం కలిగించగా.. కేంద్ర ప్రభుత్వానికి రూ. 2 కోట్ల మేర లబ్ధి కలిగించారన్నది ఆడిట్ గట్టిగా ఎత్తి చూపినట్టుగా తెలుస్తోంది. ఇది సర్దుబాటు చేయలేని నష్టంగా ఆడిట్ అధికారులు పేర్కొనటం గమనార్హం. ఆడిట్ నివేదిక ఉన్నతాధికారులకు అందినా కిమ్మనటం లేదు. బాధ్యులైన అధికారులకు కనీసం షోకాజ్ నోటీసులు కూడా ఇవ్వలేదు. దీంతో ఆర్టీసీ ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. చిన్న ఉద్యోగుల విషయంలో పావలా తేడా వచ్చినా నానా హడావిడి చేస్తారని, అదే అధికారులు తప్పులు చేస్తే మాత్రం చర్యలు ఉండటం లేదని ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి.

కాలువలు.. కడగండ్లు

(5వ పేజీ తరువాయి)

గ్రామ సచివాలయాల్లో సిబ్బంది చెబుతుండటంతో రైతులు వెనుదిరగాల్సి వస్తోంది. తమ తప్పులేకున్నా నీటితీరువా నగదుకు ఆరుశాతం వడ్డీని కూడా చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి తీరువా బకాయిలు పెండింగ్‌లో పడటంతో ఈ ఏడాది ఎంతమేర కాలువల మరమ్మతులకు నిధులను కేటాయిస్తారనే అంశంపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. గతేడాది వైసీపీ ప్రభుత్వం కాలువల నిర్వహణ పనులకు కేవలం రూ.26 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు, నాచులను తొలగించాలనే ఆంక్షలు పెట్టింది. పంట కాలువలు, డ్రైనేజీలలో పూడికతీత, కాలువ గట్ల బలోపేతం, గేట్లకు మరమ్మతులు వంటి పనులు చేయనేలేదు. ఈ ఏడాది జూలై వరకు కాలువలలో పనులు చేసేందుకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేసి, కాలువల మరమ్మతులకు నిధులను సమృద్ధిగా కేటాయించాలని జిల్లా రైతులు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

రహదారిపై ఆక్రమణల తొలగింపు

పెనమలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పోరంకి సెంటర్‌లో ఆక్రమణలను పెనమలూరు ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ నేతృత్వంలో సిబ్బంది సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, జాతీయ రహదారిని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారని దీంతో వాహనదారులు, ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారని, ఆక్రమణలను ఇక ముందు సహించబోమని, జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.



రోడ్డుపై ఆక్రమణలు తొలగిస్తున్న పోలీసులు

నేటి నుంచి బాలల ఆధార్ అప్‌డేట్ శిబిరాలు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల లోపు చిన్నా రులకు ఆధార్ అప్‌డేట్ శిబిరాలను మండలంలో మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వర రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు షెడ్యూల్ వారీగా సచివాలయ కేంద్రాల్లో 0-6 ఏళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.



పెదఅవుటపల్లిలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్

తడి, పొడి చెత్తపై అవగాహన

ఉంగుటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : తడి, పొడి చెత్తను గుర్తించి, వేర్వేరుగా చేయటంపై ప్రజలు అవగాహన కలిగివుండాలని ఈవోపీ ఆర్డీ వి.దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం పెదఅవుటపల్లి గ్రామంలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి జంగం యోహాన్‌తో కలిసి ఇంటింటికి వెళ్లి తడి,పొడి చెత్తను వేర్వేరుగా విభజించటంపై స్థానిక మహిళలు, ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా కూరగాయలు, పళ్ల వ్యర్థాలు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా విభజించి ప్రతి రోజూ చెత్తను సేకరించే శానిటేషన్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మానవత అందిస్తున్న సహకారాన్ని మరిచిపోకుండా ప్రయోజకులైన తరువాత తిరిగి సమాజానికి మానవత్వంతో చేయూత అందించాలని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో కానుమోలు చింతా సీతయ్య జూనియర్ కళాశాలలో ఎమ్మెల్టీ కోర్సు చదువుతున్న పేద విద్యార్థిని ఫీజుల నిమిత్తం మానవత జంక్షన్ శాఖ నిర్వాహకులు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మానవత నిర్వాహకులు వేగిరెడ్డి సూర్యనారా యణ, జేవీవీ సత్యనారాయణ, ఘంటా సత్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, పీవీఎస్ చలం, ఇందిరా దేవి పాల్గొన్నారు.

ఫైనాన్స్ కంపెనీ సొమ్ము వాడుకున్న అధికారులపై ఫిర్యాదు

పెనమలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పోరంకి నిడమానూరు రోడ్డులోని క్రిష్ ఫైనాన్సియల్ లిమిటెడ్ కంపెనీలో మేనేజర్, లోన్ కలెక్షన్ ఆఫీసర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మేనేజర్ వంగ పృధ్వీబాబు రూ. లక్షకుపైన, లోన్ కలెక్షన్ ఆఫీసర్ కడియం రంజిత్ రూ. 1.8 లక్షలను కస్టమర్ల నుంచి వసూలు చేసి తమ సొంతానికి వాడుకొని కంపెనీని మోసం చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కేసు నమోదు చేశారు.

లైంగిక వేధింపులపై..


వివాహితను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యనమలకుదురుకు చెందిన ఎస్కే మీరావలి స్థానికంగా ఉంటున్న ఒక మహిళ బెడ్ రూంలోకి వెళ్లి లైంగికంగా వేధింపులకు గురి చేశాడని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.



విరాళం అందజేస్తున్న కిలారు సాంబశివరావు, లక్ష్మి దంపతులు

ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సింగన్నగూడెంలో పునఃనిర్మిస్తున్న శ్రీగంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయానికి దాతలు విరాళం అందజేశారు. కిలారు సాంబశివరావు, లక్ష్మి దంపతులు రూ. 1,00,116 విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కొట్టే రాజాకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బెజవాడ కృష్ణారావు, బత్తుల రామ్మోహనరావు, సాంబశివరావు, పర్వతనేని రాజబాబు, మరీదు శ్రీను, సీతారామయ్య పాల్గొన్నారు.



కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

● గ్రామాల్లో టీడీపీ నాయకుల విస్తృత ప్రచారం

● పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు



జంక్షన్‌లో మోడల్ బ్యాలెట్ పేపరును విడుదల చేస్తున్న టీడీపీ నేతలు వీరబాబు, హరిబాబు

హనుమాన్‌జంక్షన్/ రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించడానికి ప్రతి క్లస్టర్ ఏజెంట్లు, బూత్ ఏజెంట్లు కృషి చేయాలని ఎస్ఎస్సీ ఎడమ కాలువ పీసీ ఛైర్మన్ కోటా వీరబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వర్రా ణం హరిబాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక విజయవాడ రోడ్డులోని ఆళ్ల గోపాలకృష్ణ ఆవరణలో ఏర్పాటు చేసిన క్లస్టర్ ఏజెంట్ల సమావేశంలో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఎన్నికల మోడల్ బ్యాలెట్ పేపరును నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజేంద్రప్రసాద్‌కు ఎన్నికల అధికారులు బ్యాలెట్ పేపరులో వరుస క్రమంలో మొదటి పేరు ఇవ్వడం విజయానికి సంకేతమన్నారు. అయోమయానికి గురికాకుండ అభ్యర్థిని తేలికగా గుర్తించేలా మోడల్ బ్యాలెట్‌ను ఓటర్లకు అందించి అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, ఎస్ఎస్సీ ఎడమ కాలువ పీసీ వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, నాయకులు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేశ్, గుండపనేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, అట్లూరి శ్రీనివాసరావు, చిన్నాల లక్ష్మీనారాయణ, చింతల శివ వెంకట అప్పారావు, మండాది రవీంద్ర, మొవ్వా వెంకటేశ్వరరావు, వడ్డిల్లి లక్ష్మీక్లస్టర్, బూత్ ఏజెంట్లు పాల్గొన్నారు.

బొమ్ములూరు ఎంబీఏ కాలేజీలో..

విద్యావేత్త, కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయడం ద్వారా పట్టభద్రులు రాష్ట్ర ప్రగతికి సహ కారం అందించాలని గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు కోట వీరబాబు అన్నారు. బొమ్ములూరులోని ఎంబీఏ కాలేజీ ఆవరణలో సోమవారం పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఓటును అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వర్రాణం హరిబాబునాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, కొల్లి చందు, తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు పట్టణ, మండల పరిధిలో..

ఉయ్యూరు : పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా సోమవారం ఉయ్యూరు పట్టణ, మండల పరిధిలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. క్రమశిక్షణ కలిగిన నాయకుడు ఆలపాటిని గెలిపించడం ద్వారా శాసన మండలిలో విద్యార్థులు, ఉద్యోగుల తరఫున పోరాటం చేస్తారని ప్రచారం చేశారు. స్థానిక సీహెచ్‌సీలో ప్రచారం నిర్వహించి వైద్యులు, సిబ్బందికి బ్యాలెట్‌పై ఓటువేసే విధానాన్ని వివరించారు. రూరల్ మండల పరిధి పీహెచ్‌సీల్లో ప్రచారం చేసి ఆలపాటిని గెలిపించాలని కోరారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ కె ప్రవీణ్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జయ దేవ్, జబర్లపూడి సర్పంచ్ సూరపనేని శేషవర ప్రసాద్ పాల్గొన్నారు.



ఉయ్యూరు సీహెచ్‌సీలో ప్రచారం చేస్తున్న నాయకులు

అక్రమ మద్యం విక్రేతలపై 36 కేసులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గత సంవత్సరం డిసెంబరు నుంచి ఇప్పటి వరకు అక్రమంగా మద్యం విక్రయించే వారిపై దాడులు చేసి 41 మందిని అరెస్టు చేసి 36 కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శేషగిరిరావు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, దాడుల్లో 158 లీటర్ల మద్యం సీజ్ చేశామని, వివిధ అక్రమ మద్యం విక్రయ కేసులతో సంబంధం ఉన్న 55 మందిని ఆయా మండల తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేశామని, లైసెన్స్ లేకుండా మద్యం విక్రయించడం నేరమని, అక్రమ మద్యం విక్రయానికి పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రవికుమార్‌ను సత్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుడివాడ ఇన్‌చార్జి డీవైఈవోగా రవికుమార్

గన్నవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండల ఎంఈవోగా పనిచేస్తున్న కొండా రవికుమార్‌కు గుడివాడ డీవైఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ అధికారులు సోమవారం ఉత్వర్వులు ఇచ్చారు. ప్రస్తుతం గన్నవరంతో పాటు ఉంగుటూరు మండలాలకు ఎంఈవోగా పనిచేస్తున్నారు. ఇన్‌చార్జి డీవైఈవోగా బాధ్యతలు రావటంతో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్, మండల కార్యదర్శి జి.రాజాబాబు, టి.శ్రీనివాస్, కర్రా వరప్రసాద్, డి.శ్రీనివాస్, వీవీ బాలస్వామి, జె.కుమారి పాల్గొన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ ఆధ్వర్యంలో రవికుమార్‌ను సత్కరించారు.



క్యూలైన్లలో భక్తులు

వీరమ్మ తిరునాళ్లకు కొనసాగుతున్న భక్తుల రద్దీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లకు భక్తుల రద్దీ కొనసాగుతుంది. తిరునాళ్లలో పదవ రోజైన సోమవారం అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు పలు ప్రాంతాలనుంచి భక్తులు వేకువ జామునుంచి తరలివచ్చి పొడవాటి క్యూల్లో నిలుచున్నారు. శనివారంతో తిరు నాళ్ల ముగియనుండగా అమ్మవారికి మొక్కులు తీర్చు కునేందుకు భక్తులతో పాటు పలువురు ప్రముఖులు వస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు తయారు చేసి నైవేద్యం సమర్పించగా, పసుపు కుంకుమ, చీరలు, కొబ్బరికాయల స్టాళ్ల వద్ద మహిళల రద్దీ కన్పించింది. వీరమ్మ తిరునాళ్లలో అంత్యంత ప్రాముఖ్యత సంతరిం చుకున్న శిడిబండి వేడుకు మంగళవారం సాయంత్రం నిర్వహి స్తున్నారు. తిరునాళ్లలో 11వ రోజు అత్యంత వైభవంగా జరిగే శిడిబండి వేడుక తిలకించేందుకు పలు ప్రాంతాలనుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. శిడిబండి వేడుకలో ఏవిధమైన సంఘ అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

దాసాంజనేయస్వామికి తమలపాకుల పూజ

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):బాపులపాడులోని దాసాంజనేయస్వామి ఆలయంలో 16 రోజులు పండుగ సందర్భంగా సోమవారం స్వామి వారికి దశ సహస్రనామార్చనతో తమలపాకుల పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మారేపల్లి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు వడ్డిల్లి లక్ష్మీకుమారి, మొవ్వా నాగరాజు పలువురు మహిళలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, ఏవో మధుసూదనరావు

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు

గన్నవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : దంత వైద్య విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు అన్నారు. దంత వైద్య కళాశాల విద్యార్థులు నిజామాబాద్‌లో ఈ నెల 13 నుంచి 15 వరకు రెండవ నేషనల్ డెంటల్ కన్వెన్షన్‌లో జరిగిన సైంటిఫిక్ పేపర్ ప్రజంటేషన్, మెరిట్ ఎగ్జామ్, స్పోర్ట్స్, స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని చక్కటి ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో విజేతల అభినందన సభ నిర్వహించారు. సైంటిఫిక్ విభాగం పేపర్ ప్రజంటేషన్‌లో ఇంటర్న్ విద్యార్థి పి.శ్రావణి ద్వితీయస్థానం, మెరిట్ ఎక్జామ్‌లో పి.శ్రావణి మొదటి స్థానం, వై.నాగరాజు ద్వితీయ స్థానం, స్విమ్మింగ్‌లో బీడీఎస్ విద్యార్థి కె.మోనిష్ రన్నర్‌గా నిలిచి సిల్వర్, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో షేక్ అష్రాఫ్, జి.హేమంత్‌లు రన్నర్‌గా నిలిచి సిల్వర్ పతకాన్ని సాధించారు. క్రికెట్‌లో పి.రాహుల్, డాక్టర్ శ్రీహర్ష వి.వేణు, వై.నాగరాజు రన్నర్‌గా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఏవో వై.మధుసూదనరావు డాక్టర్ అనుమోలు శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే విజయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : చదువుపై దృష్టి కేంద్రీకరించి ఏకాగ్రతతో చదవడం వల్ల పరీక్షల్లో విజయం సాధించ వచ్చని, భయం వీడాలని అల్లూరి సీతారామరాజు జిల్లా, డొంకరాయి ఎస్సై టి. శివకుమార్ విద్యార్థులకు సూచించారు. ఆరుగొలను హైస్కూల్ హెచ్‌ఎం దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ఉపకరణాలను (ప్యాడ్లు, పెన్నులు, తదితరాలు) షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అట్లూరి రాజశేఖర్‌తో కలిసి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధనియాల అప్పారావు, నల్లగంచు రామకృష్ణ, కొలుసు వాసు, ఉపాధ్యాయులు పద్మ, ఉషాకుమారి, సుబ్బారావు, తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఉంగుటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పిల్లల కడుపులో నులిపురుగుల వల్ల కలిగే అనారోగ్యసమస్యలను అం తంచేసి ఆరోగ్యంగా ఎదిగేందుకు 1నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ డీవార్మింగ్ (ఆల్బెండజోల్) మాత్రలు ఏడాదికి రెండుసార్లు తప్పనిసరిగా వేయాలని పెదఅవుటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కరీముల్లా మొహీనుద్దీన్ అన్నారు. సోమవారం సంబంధిత పీహెచ్‌సీల్లోని ఆరోగ్యవైద్యసిబ్బంది ఆధ్వర్యంలో డీవార్మింగ్ మాత్రలు వేసే కార్యక్రమం నిర్వహించారు. నాలుగు పీహెచ్‌సీల వైద్యాధికారులు సుజిత, జితేంద్ర, వాణి, భవాని, శిరీష, సుబ్బారావు, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్యఆరోగ్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి



ఉంగుటూరులో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో హరీష్‌కుమార్

ఉంగుటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సొంత వ్యవసాయ భూమి కలిగిన రైతులందరూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ యూనిక్ ఐడీ(రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య) కోసం సంబంధిత రైతుసేవాకేంద్రాల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో హరీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని వేమండ, ఉంగుటూరు, ఇందుపల్లి రైతు సేవాకేంద్రాలను సందర్శించిన ఆయన ఆయా కేంద్రాల్లో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, వీఏఏలు దుర్గాప్రసాద్, జ్ఞానేశ్వర్, రసూల్, రైతులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ డి.కె. బాలాజీ

భూ రికార్డులు సక్రమంగా నిర్వహించండి

కలెక్టర్ డి.కె. బాలాజీ

కంకిపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : భూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ అన్నారు. కంకిపాడులో సోమవారం ఆయన పర్యటించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను, సాలిడ్ వేస్ట్ ప్రొసెసింగ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలు, రైతుల నుంచి వచ్చే సమస్యలను తక్షణం పరిష్కరించాలని, రీ సెటిల్మెంట్ రిజిస్టర్, 1బి రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. అదే విధంగా పునాదిపాడులోని ప్రొసెసింగ్ యూనిట్‌ను పరిశీలించి, సంబంధిత అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భవన్నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ ఉస్మాన్, గ్రామ రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

చార్ట్ కౌన్సెలింగ్ రద్దు కోరుతూ ధర్నా

ఉయ్యూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కార్యాలయం సర్క్యులర్‌కు వ్యతిరేకంగా జరిపిన చార్ట్ కౌన్సెలింగ్ రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జోనల్ ప్రెసిడెంట్ డీఎం ఆర్ రాజు, ఉయ్యూరు డిపో సెక్రటరీ పి. మురళీకృష్ణ అన్నారు. ఉయ్యూరు ఆర్టీసీ డిపోలో కేంద్ర కార్యాలయం సర్క్యులర్‌కు విరుగా నిర్వహించిన చార్ట్ కౌన్సెలింగ్ రద్దు చేసి తిరిగి కౌన్సెలింగ్ జరపాలని కోరుతూ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన ఆందోళనలో భాగంగా సోమవారం నాల్గవ రోజు రిలేదీక్ష రాజు ప్రారంభించారు. చార్ట్ కౌన్సెలింగ్‌కు వ్యతిరేకంగా ఉయ్యూరు డిపో ఉద్యోగులు చేపట్టిన శాంతి యుత నిరసన కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎస్ఎంసీ ఛైర్మన్ ఆరేపల్లి శివసాయి ప్రసాద్, కమిటీ సభ్యుడు ఎం చింతయ్య దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఎస్ సారధి, సీహెచ్ పిచ్చయ్య దీక్షలో పాల్గొనగా ఎన్ఎంయూఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాసరావు, కెఎస్ రావు ఇతర ఉద్యోగులు పాల్గొని నిరసన తెలిపారు.



GOLD FINANCE



» బంగారం కొనబడును, బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర: 83338 33368

AJB -225796

WANTED

» విజయవాడ మెట్రో పాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, నార్త్ ఇండియన్ చెఫ్, హౌస్ కీపింగ్ బాయ్స్, సెక్యూరిటీ గార్డ్స్, ఆకర్షణీయమైన జీతం. ✆ 7288885598

AJB - 1361

» ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఆటోనగర్ గేట్ దగ్గరకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గం. డ్యూటీ, జీతం: 12,000/-, అర్హత: ఇంటర్. సంప్ర: ✆ 98481 32160, 62812 00949

AJB- 225964

» Jobs in Malaysia Where House, Factory, Hospitals, Supermarket, Workers Salary 40K. Process Time 30 days Cell : 98496 42038

AJB - 1354

TO-LET COMMERCIAL

» N.T.R. కాలనీ మహానాడు రోడ్డు లో జ్యువెల్ కాకతీయ కాంప్లెక్స్ నందు 2250 చ.అడుగులు షాపింగ్ కాంప్లెక్స్‌లకు, షోరూమ్‌లకు, బ్యాంకులకు, ఆఫీస్‌లకు, సూపర్ మార్కెట్‌లకు అద్దెకు ఇవ్వబడును. సెల్ : 92464 78333 ని సంప్రదించగలరు.

AJB - 225735

PLOT FOR SALE

» విజయవాడ, గొల్లపూడి, కంచికచర్ల, పరిటాల పరిసర ప్రాంతాల్లో ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన వారు సంప్రదించగలరు. సెల్: 93947 17262

AJB-225792

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడిఐటి





పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం

సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 01166

పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, వన్‌టౌన్, భవానిపురం : 99854 09286, పెనమలూరు : 99854 09240, మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733 గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు

✆ 99854 09240, 99854 11733, 99854 09286

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు

✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604, డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

సమస్యల సంగమం!

అపరిశుభ్రంగా పవిత్ర సంగమ ప్రాంతం



బురదతో నిండిపోయిన స్నానాల ఘాట్



నిరుపయోగంగా బయో టాయిలెట్స్

- టీడీపీ హయాం(2014-2019)లో ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా వెలుగొందిన ప్రదేశం
- 2019లో వైసీపీ ప్రభుత్వమొచ్చాక నిత్యహారతులు నిలిపివేత.. నిలిచిపోయిన భక్తుల రాక
- మహా శివరాత్రినాటికి సంగమ ప్రాంతాన్ని బాగుచేయాలని కోరుతున్న భక్తులు

(ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాం(2014 నుంచి 2019)లో ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా పవిత్ర సంగమం ఓ వెలుగు వెలిగింది. రోజూ సాయంత్రం 6 గంటలకు కృష్ణా- గోదావరి నదుల కలిసే ప్రదేశం వద్ద నిత్య హారతులు ఉండేవి. ఆ సమయంలో భారీ సంఖ్యలో ప్రజలు, భక్తులు, పర్యాటకులు ఇక్కడకు వచ్చేవారు. నిత్యం జనంతో కళకళలాడుతూ ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ పవిత్ర సంగమం నిర్వహణను గాలికొదిలేసింది. అప్పటి వరకు నిర్వహిస్తున్న నిత్య పుణ్యహారతులను నిలిపివేసింది. భక్తుల రాక నిలిచిపోయింది. పవిత్ర సంగమ ప్రాంతం అపరిశుభ్రంగా మారిపోయింది.

శివరాత్రికి పుణ్యస్నానాలు ఆచరించేదెలా?

ఈనెల 26న మహా శివరాత్రి సందర్భంగా కృష్ణానది-గోదావరి కలిసే ప్రాంతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తారు. అయితే ఆ ప్రాంతంలో అన్నీ సమస్యలే ఉన్నాయి. ఇబ్రహీంపట్నం నుంచి పవిత్ర సంగమం వద్దకు వెళ్లే రహదారి బీటలు వారింది. వేడి నీళ్ల కాలువ వైపు మట్టి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. సంగమం వద్ద అంతా అపరిశుభ్రంగా ఉంది. స్నానాల ఘాట్ వద్ద దుమ్ము, ధూళితో నిండి ఉంది. కృష్ణానది-గోదావరి కలిసే ప్రాంతం వద్ద అంతా బురదమయంగా ఉంది. గత వరదలకు కొట్టుకు వచ్చిన బురదతో మెట్ల భాగంతో పాటు ఘాట్ కూడా అధ్వానంగా ఉంది. ఇక చెట్లను నరికి ఎక్కడి అక్కడే తగలబెడుతున్నారు. వాటిని శుభ్రం చేయడం లేదు. బయో టాయిలెట్స్ నిరుపయోగంగా ఉన్నాయి. పోలీస్ పోస్టులో పోలీసులు ఉండటం లేదు. ఇలా అనేక సమస్యలతో పవిత్ర సంగమ ప్రాంతం జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిపోయింది.

లవర్స్ స్పాట్‌గా సంగమ ప్రాంతం

నిర్మానుష్యంగా ఉండడంతో ఈ ప్రాంతాన్ని ప్రేమికులు లవర్స్ స్పాట్‌గా చేసుకొని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. సరైన నిఘా లేకపోవడమే దీనికి కారణమని భక్తులు అంటున్నారు. అధికారులు పవిత్ర సంగమం ప్రాంతాన్ని శుభ్రం చేయించి శివరాత్రి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.



వేడి నీళ్ల కాలువ పక్కనే నిలువునా చీలిపోయిన రహదారి



వేడి నీళ్ల కాలువ వెంట కుంగిపోయిన రహదారి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి బాల వీరాంజనేయస్వామికి ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వినతి

గాంధీనగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల సర్వీసు వ్యవహారాల్లో తీసుకోవాల్సిన చర్యలను మంత్రికి వివరించారు. 3,501 జనాభా దాటిన సచివాలయాల పరిధిలో ప్రతి 500 లేదా 1000 మంది జనాభాకు అదనంగా ఒక సచివాలయ ఉద్యోగిని నియమించాలని ఆయన కోరారు. సచివాలయ ఉద్యోగుల్లో ఎంతమంది మల్టీపర్పస్, టెక్నికల్ ఉద్యోగులను సర్దుబాటు చేస్తున్నారో ఉద్యోగులకు తెలపాలన్నారు. సచివాలయ ఉద్యోగులందరినీ వివిధ ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేసి పదోన్నతులు కల్పించాలని కోరారు. పరస్పర, భాగస్వామ్య బదిలీలు త్వరితగతిన చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య, కోశాధికారి జ్యోతి, జేఏసీ నేత వి.దామోదరరావు పాల్గొన్నారు.



కార్పొరేషన్ స్థలంలో కబ్జా గ్యాంగ్ ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

కబ్జాపై కొరడా

- కార్పొరేషన్ స్థలంలో సరిహద్దు రాళ్లు ధ్వంసం చేసిన అధికారులు

పాయకాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కండ్రిక కాలనీ శివారులోని ఆంధ్ర సిమెంట్ ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ అండ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ హౌస్ సొసైటీ లిమిటెడ్ వెంచర్‌కు ఆనుకుని ఉన్న కార్పొరేషన్ స్థలంలో కబ్జా గ్యాంగ్ వేసిన సరిహద్దు రాళ్లను సోమవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు ధ్వంసం చేశారు. స్థానికంగా రూ.10 కోట్లు విలువైన కార్పొరేషన్ స్థలం కబ్జాకు గురవుతోందంటూ రెండు రోజులుగా కబ్జా గ్యాంగ్ పేరుతో ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. సోమవారం కబ్జాకు గురైన కార్పొరేషన్ స్థలాన్ని పరిశీలించారు. కబ్జా గ్యాంగ్ ఏర్పాటు చేసిన పునాది రాళ్లను ధ్వంసం చేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సునీత హెచ్చరించారు. కార్పొరేషన్ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

పారిశుధ్య సేవలు ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పొద్దు



ఏడీఎం మురళీకృష్ణ గౌడకు వినతిపత్రం అందిస్తున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ నాయకులు

కృష్ణలంక, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సేవలను ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పొద్దని ఏడీఎం మురళీకృష్ణ గౌడకు ఆయన కార్యాలయంలో సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ నాయకులు రంగనాయుడు, పి.సుబ్బరాయుడు వినతిపత్రం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 17 నుంచి మార్చి 3 వరకు దశలవారీగా పారిశుధ్య పనులను ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పారిశుధ్య కార్మికులు ఆందోళన చెందుతున్నారని వారు తెలిపారు. మున్సిపల్ పాసింజర్ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పూర్తి బాధ్యత స్థానిక కమీషనర్లకే ఉండాలని వారు కోరారు. పర్మినెంట్ మున్సిపల్ ఉద్యోగ కార్మికులకు నాలుగేళ్లుగా సరెండర్ లీవులు, 3 డీఏలు విడుదల కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం వాటిని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని లేని పక్షంలో మార్చి 6న చలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరించారు.

సీపీఎస్ ఉద్యోగులందరికీ డీఏ బకాయిలు చెల్లించాలి

- ఏపీసీపీఎస్ఈఏ అధ్యక్షుడు బాజీ పఠాన్

గాంధీనగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని విభాగాల్లో పని చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు విడుదల చేసి లక్షలాది మంది ఉద్యోగులకు అందకుండా చేయడం రాజ్యాంగ సమానత్వపు హక్కుకు విరుద్ధమని ఏపీసీపీఎస్ఈఏ అధ్యక్షుడు బాజీ పఠాన్ అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోల ప్రకారం మార్చి నాటికి బకాయిలు ఉన్న మొత్తం సొమ్మును ప్రతి సీపీఎస్ ఉద్యోగి తీసుకునేలా ట్రెజరీ సైట్‌లో ఎనేబుల్ చేయాలని కోరారు. ఈ మేరకు సచివాలయంలో సీఎఫ్ఎంఎస్ ఉన్నతాధికారులకు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సాంబేల శాంతాబాయి, ఆర్గనైజింగ్ సెక్రటరి మహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

నవ వధువుపై వేధింపుల కేసులో ఆర్టీసీ ఉద్యోగికి రిమాండ్

- పరారీలో వరుడి తల్లి, పిన్ని

విద్యాధరపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వివాహమైన రెండో రోజే వధువును వేధించిన కేసులో వరుడి తండ్రి విజయవాడ బస్సు స్టేషన్‌లో కంట్రోలర్‌గా పనిచేస్తున్న గొల్లపూడికి చెందిన చెరుకూరి లక్ష్మణరావును భవానీపురం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. అతనిని నెల్లూరులోని జైలుకు తరలించారు. వరుడి తల్లి భవాని, ఆమె సోదరి పరారీలో ఉన్నట్లు సమాచారం. బాధితురాలు ఈనెల 12న ఫిర్యాదు చేయగా, ఆరోజే ఎన్ఆర్ఐ వరుడు చెరుకూరి హేమంత్ అజయ్‌తో పాటు తండ్రి లక్ష్మణరావును కూడా పోలీసులు అరెస్టు చేశారు. లక్ష్మణరావు ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆయన అరెస్టును బహిర్గతం చేయలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్టీసీ ఉద్యోగి లక్ష్మణరావుపై చర్యలకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అరెస్టుపై నివేదిక ఇవ్వాలని ఆర్టీసీ ఎన్టీఆర్ జిల్లా అధికారి ఎంవై దానం కింది అధికారులను ఆదేశించారు. అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పుణ్యస్నానాల పుష్కరఘాట్‌ను రహదారిగా మార్చేశారు!

వ్యాపార అవసరాల కోసం భక్తుల మనోభావాలతో చెలగాటం

- రివర్ కన్జర్వెన్సీ, రెవెన్యూ అధికారుల సహకారం!



ఐలూరు జంట పుష్కరఘాట్లలో ఎడమవైపు ఘాట్‌ను ఇసుకతో వాహనాల రహదారిగా మార్చేసిన దృశ్యం

దక్షిణకాశీగా ప్రసిద్ధి గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం ఐలూరులో కృష్ణానది వద్ద పుణ్యస్నానాలు ఆచరించే పుష్కరఘాట్‌ను ఓ వ్యక్తి తన వ్యాపార అవసరాల కోసం రహదారిగా మార్చేశారు. లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఘాట్‌ను వాహనాల నడిచే రహదారిగా పూడ్చివేశారు. ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీయటమేనని హిందూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు): ఐలూరు పుణ్యక్షేత్రం కావటంతో కృష్ణానది ఒడ్డున 2016లో రెండు పుష్కరఘాట్లను రివర్ కన్జర్వెన్సీ(ఆర్సీ) అధికారులు నిర్మించారు. ఈ ఘాట్లను చాలా పవిత్రంగా భక్తులు భావిస్తారు. నదిలో నీరు లేకున్నా పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. ప్రతి ఏడాది మహాశివరాత్రికి లక్షమంది భక్తులు వచ్చి నదీపాయలో జల్లుస్నానాలు ఆచరిస్తారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఐలూరులో పుష్కరఘాట్‌ను పూడ్చివేయటం దారుణమని భక్తులు అంటున్నారు. ఘాట్‌ను రహదారిగా మార్చేందుకు రివర్ కన్జర్వెన్సీ(ఆర్సీ) అధికారులు, రెవెన్యూ అధికారులు సహకరించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 13వ తేదీన ఐలూరు శ్రీరామేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశం ముగిశాక అధికారులు నదీపాయ వద్దకు వచ్చి పూడ్చేసిన పుష్కరఘాట్‌ను కళ్లారా చూసి కూడా పట్టనట్టుగా ఉన్నారని, పలువురు తెలిపారు. కొందరు తమ వ్యాపార అవసరాలకు పుష్కరఘాట్‌ను పూడ్చేసి రహదారిగా మార్చారని ఆరోపిస్తున్నారు.

మాకు తెలియదు

పుష్కరఘాట్‌ను తొలగించినట్టు మాకు తెలియదు. తొలగించేందుకు వీల్లేదు. రహదారిగా మార్చేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. - శ్రీరాం జనార్ధన్, ఆర్సీ జేఈ

రహదారిగా మార్చిన ఘాట్ ఇదే



2016 కృష్ణా పుష్కరాల్లో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు(ఫైల్)

ఆలపాటిని ఎమ్మెల్సీగా గెలిపిద్దాం

- అందరం కలిసికట్టుగా, ప్రణాళికాబద్ధంగా పనిచేద్దాం
- జనసేన పట్టభద్రుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్



చేతులు పైకెత్తి ఐక్యతా చిహ్నాన్ని చూపుతున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను

వన్‌టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అందరం కలిసికట్టుగా, ప్రణాళికాబద్ధంగా, వ్యూహాత్మకంగా పనిచేసి ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కూటమి బలపరచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపిద్దామని పట్టభద్రులకు జనసేన రాజకీయ వ్యవహారాల విభాగం చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ఆలపాటి గెలుపును కాంక్షిస్తూ శేషసాయి కల్యాణమండపంలో సోమవారం జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజేంద్రప్రసాద్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని, మంత్రిగా పనిచేశారని, ఆయనను శాసనమండలికి పంపిస్తే సమస్యల పరిష్కారానికి పని చేస్తారని తెలిపారు. 2024 ఎన్నికల్లో జనసేన గెలుపుకోసం తెనాలిలో విస్తృత ప్రచారం చేశారని తెలిపారు. వైసీపీ తన ఐదేళ్ల పాలనలో ప్రజాధనాన్ని లూటీ చేసిందని, వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని మనోహర్ ఆరోపించారు. జనసేన ఎప్పుడూ ప్రజాపక్షమే అన్నారు. గత ఐదేళ్లలో జనసైనికులు, వీర మహిళలపై దాడులు చేసిన వారిని వదిలిపెట్టేది లేదన్నారు. సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు జనసైనికులపై అక్రమ కేసులు పెట్టారని, జైళ్లలో నిర్బంధించారని, వాటిని తేలికగా మరచిపోబోమన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల స్ఫూర్తితో ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీగా పోటీచేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానని అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణా - గుంటూరు జిల్లాలకు చెందిన జనసేన ఎమ్మెల్యేలు, జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, వీఓసీలు, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, వీర మహిళలు ప్రాంతీయ సమన్వయకర్తలు, క్షేత్రస్థాయి నాయకులతో నిర్వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పి.అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, కిలారి రోశయ్య, నాయకులు బండ్రెడ్డి రామకృష్ణ, గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాసయాదవ్, చిల్లపల్లి శ్రీనివాసరావు, చిలకలపూడి పాపారావు, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, బండి రామకృష్ణ, రావి సౌజన్య పాల్గొన్నారు.

నా నిర్ణయంలో మార్పులేదు

- రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ఇంతకు ముందే ప్రకటించా: మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)

వన్‌టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు తాను గత ఏడాది జూన్ పదో తేదీన ప్రకటించానని, ఆ నిర్ణయంలో ఎటువంటి మార్పు లేదని మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మీడియాలో తాను పార్టీ మారుతున్నట్లు వచ్చిన కథనంలో వాస్తవం లేదన్నారు. ప్రజలకు సేవ చేయాలంటే రాజకీయాల్లో ఉండాల్సిన అవసరం లేదని తాను హృదయపూర్వకంగా నమ్ముతున్నానని తెలిపారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రజాసేవ జీవిత నిబద్ధత అని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఉంటుందని పేర్కొన్నారు. తన రాజకీయ పునరాగమనంపై నిరాధారమైన వార్తలు వచ్చినా వాటిని పట్టించుకోవద్దని పేర్కొన్నారు. తన ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కేశినేని నాని కృతజ్ఞతలు తెలిపారు.

కూలీల అకౌంట్లు వాడుకున్నారు

- సైబర్ నేరగాళ్ల కొత్త పంథా
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు పాల్పడుతున్న నేరగాళ్లు కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. అందుకు అమాయక కూలీల అకౌంట్లను వాడుకుంటున్నారు. సోమవారం ఇలాంటి ఘటనే అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో వెలుగు చూసింది. వడ్డెర కాలనీకి చెందిన పీట్ల వెంకటేశ్వరరావు కూలి పని చేస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన డానియేల్, రాముతో ఆయనకు పరిచయం ఉంది. గత ఏడాది వన్‌టౌన్‌లోని టీబీఎస్ బ్యాంక్‌లో అకౌంట్ ఓపెన్ చేస్తే రూ.1,500 ఇస్తారని వెంకటేశ్వరరావుకు డానియేల్, రాము చెప్పారు. దీంతో వెంకటేశ్వరరావు అకౌంట్ ఓపెన్ చేశాడు. రూ.1,500 ఇవ్వడంతో పీట్ల దుర్గాభవాని, వేముల సుశీల, వేముల ఇసాక్‌లతో కూడా అకౌంట్లు ఓపెన్ చేయించారు. ఒకొక్కరికి రూ.1500 ఇచ్చారు. పాస్‌పుస్తకాలు, ఏటీఎం కార్డులు, చెక్‌బుక్‌లను వారి నుంచి తీసేసుకున్నారు. ఈనెల 10న మహారాష్ట్ర జలగాం వద్ద జరిగిన ఓ సైబర్ క్రైమ్ కేసుకు సంబంధించిన నోటీసులు పీట్ల వెంకటేశ్వరరావు, పీట్ల దుర్గాభవాని, వేముల సుశీల, ఇసాక్‌లకు అందాయి. అవి అర్థం కాక తెలిసిన వారికి చూపించారు. పోలీసు నోటీసు వచ్చిందని, వేరే అకౌంట్ల నుంచి నలుగురి అకౌంట్లకు సుమారు రూ.17.50 లక్షలు జమ అయ్యాయని తేలింది. ఆ నగదు వీరి అకౌంట్లలో లేదు. చెక్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు డానియేల్, రాముకు ముందే అప్పగించడంతో వారిపై ఈ నలుగురు బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము రూ.1500 వస్తాయంటే అకౌంట్లు ఓపెన్ చేశామని, తమకు ఏమీ తెలియదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతిలో అంతర్జాతీయ గార్డెన్ సెంటర్

- ఇజ్రాయిల్‌కు చెందిన గ్రీన్‌టెక్ లిమిటెడ్ ఆసక్తి
- ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథితో భేటీలో ప్రతిపాదన
- సీఎం చంద్రబాబు సమక్షంలో మరోమారు సమావేశం



ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథితో మాట్లాడుతున్న గ్రీన్‌టెక్ ప్రతినిధులు

విజయవాడ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో అంతర్జాతీయ స్థాయిలో గార్డెన్ సెంటర్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ఇజ్రాయిల్ దేశానికి చెందిన గ్రీన్‌టెక్ లిమిటెడ్ సంస్థ రాజధానిలో గార్డెన్ సెంటర్ ఏర్పాటుకు ఆసక్తి చూపుతోంది. సోమవారం నగరంలో అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీఎల్) సీఎండీ లక్ష్మీపార్థసారధి భాస్కర్‌తో గ్రీన్‌టెక్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి బృందం భేటీ అయింది. ఇజ్రాయిల్‌తో పాటుగా అనేక అరబ్ దేశాల్లో నెలకొల్పిన ఆకర్షణీయమైన గార్డెన్ సెంటర్లను ప్రజెంటేషన్ చేసి గ్రీన్‌టెక్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు వివరించారు. దేశాల భౌగోళిక పరిస్థితులు అక్కడి శీతోష్ణస్థితులను పరిగణనలోకి తీసుకుని అక్కడ పెంచగలిగే పండ్లు, పూలు, కూరగాయలు, వృక్షజాలాలను వివరించారు. నర్సరీల్లో పండించిన కూరగాయలు, తయారు చేసిన పలు రకాల ఉత్పత్తులను సీఎండీ ఎదుట ప్రదర్శించారు. ప్రపంచస్థాయిలో నిర్మిస్తున్న అమరావతి రాజధానిలోనూ అంతర్జాతీయ గార్డెన్ సెంటర్ ఏర్పాటుకు తమ ప్రణాళికలను ప్రజెంటేషన్ చేసి, ప్రతిపాదనలను సీఎండీకి నివేదించారు. దీనిపై అత్యున్నత స్థాయిలో నిర్ణయం తీసుకున్న తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒక సమావేశాన్ని నిర్వహించిన తర్వాత అంతిమ నిర్ణయం తీసుకుంటారు. సమావేశంలో గ్రీన్‌టెక్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు డేవిడ్ మిజ్రహి, ప్రశాంత్, కిషోర్‌తో పాటు ఏడీసీఎల్ హార్టీకల్చర్ ఏడీ వి.ధర్మజ, అర్బన్ ప్లానింగ్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్ అండ్ డిజైన్ హెడ్స్ పి.సురేష్‌బాబు, కేవీ గణేష్‌బాబులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

అదానీని కేసుల నుంచి కాపాడేందుకే మోదీ అమెరికా పర్యటన

- మాజీ సీఎంపై విచారణ చేసేందుకు చంద్రబాబుకు భయమెందుకు ?
- కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల అసంతృప్తి: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్

గాంధీనగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అదానీని కేసుల నుంచి తప్పించేందుకే ప్రధాని మోదీ ఇటీవల అమెరికా పర్యటన చేశారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ ఆరోపించారు. గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ అమెరికా పర్యటన వల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బతినేలా ఉందన్నారు. గతంలో అమెరికా వెళ్లిన దేశ ప్రధానులు ఆ దేశ అధ్యక్షుడిని మాత్రమే కలిశారని, కిందిస్థాయి వాళ్లను కలవలేదని గుర్తు చేశారు. ఏపీలో ఆరోగ్యశాఖలో శానిటేషన్ కాంట్రాక్టు కోసం మహారాష్ట్ర సీఎం పడ్నవిస్ రాష్ట్రానికి వచ్చారని, దీనికి ఆలయాల పేరు వాడుకోవడం అనైతికమన్నారు. ఈ చర్యతో పడ్నవిస్ స్థాయి దిగజారిందన్నారు. మాజీ సీఎం జగన్ పాలనకు భయపడి మాత్రమే ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించారన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వలేదన్నారు. కరోనా లాంటి వ్యాధి రాష్ట్రంలో వ్యాపిస్తున్నా ఆస్పత్రుల్లో సూది, మందులు కరువయ్యాయని మండిపడ్డారు. కేవలం అమరావతిలోనే లక్ష కోట్లు ఖర్చు చేయకుండా రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేయాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టులో ఒక మాజీ ముఖ్యమంత్రి రూ.6 వేల కోట్లు తిన్నారని ఆరోపణలున్నా, దీనిపై విచారించేందుకు చంద్రబాబు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. సిద్ధాంతాలను మార్చుకోకపోవడం వల్లనే కాంగ్రెస్ అధికారానికి దూరమవుతోందన్నారు. దేశ ప్రజలందరూ కాంగ్రెస్ పాలన కావాలని కోరుకుంటున్నారన్నారు. 2027లో జమిలి ఎన్నికలు జరుగుతాయని కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందని జోస్యం చెప్పారు. ఢిల్లీ ఘటనకు బాధ్యతవహిస్తూ రైల్వేమంత్రి రాజీనామా చేయాలన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.420

ఘంటసాలలో కిసాన్‌మేళా నేడు

ఘంటసాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఘంటసాలలోని వ్యవసాయ పరిశోధనాస్థానంలో మంగళవారం కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.సత్యప్రియ లలిత, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. వరి మాగాణుల్లో అపరాల సాగు - సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణ ప్రధాన అంశంగా ఈ మేళా జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద, కలెక్టర్ డికె.బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పివి.సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారిణి ఎన్.పద్మావతి పాల్గొంటారన్నారు.



వలందపాలెం బీసీ బాలుర కళాశాల వసతిగృహంలో న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న జిల్లా న్యాయాధికారి అరుణసారిక

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా జడ్జి అరుణసారిక అన్నారు. వలందపాలెంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహాన్ని సోమవారం ఆమె సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూశారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా వెంటనే న్యాయ సహాయం అందిస్తామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి. రామకృష్ణయ్య మాట్లాడుతూ, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ ప్రతినిధి చీలి ముసలయ్య, వసతి సంక్షేమ అధికారిణి షేక్ జహరున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నం బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గంతో జిల్లా సంఘం అధ్యక్షుడు కె.వి.వి.సత్యనారాయణ

బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర బీసీ సంక్షేమ సంఘం ఎన్నికలు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.వి.వి.సత్యనారాయణ నేతృత్వంలో సోమవారం జరిగాయి. మచిలీపట్నం శాఖ అధ్యక్షుడిగా ఎస్‌కె జానీ బాషా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బొర్రా ప్రవీణ్, కార్యదర్శిగా కందిమళ్ళ రాము, నగర మహిళా విభాగం అధ్యక్షురాలిగా తిలకచూరి నాగ శిరీష ఎన్నికయ్యారు. సత్యనారాయణ మాట్లాడుతూ, కుల గణనతో పాటు బీసీ గణన చేపట్టాలన్నారు. బీసీ సంక్షేమం కోసం సంఘం కృషి చేస్తుందన్నారు. వరదా వెంకటేశ్వరరావు, బొల్ల వెంకటేశ్వరరావు, రాగి చంద్రశేఖర్ , సి.రాజ్యలక్ష్మి, దేవిక, ఆదిలక్ష్మి, నీరజ, లక్ష్మణ్, కొండ, పరస సురేష్, జగన్మోహనరావు, వెంకటేశ్వరరావు, ముంతాజ్ తదితరులు మాట్లాడారు.



కాకర్లమూడిలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



మంగళాపురంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పట్టాభిరామ్, కనపర్తి, వెంకట్రామ్

ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

పెడన రూరల్, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కోరారు. కాకర్లమూడిలో ఉపాధ్యాయులను, గ్రాడ్యు యేట్ ఓటర్లను కలిసి కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడు నెలల్లోనే చేపట్టిన అభివృద్ధిని వివరించారు. శలపాటి ప్రసాద్, శీరం పరసాద్, సర్పంచి పరసా లక్ష్మీకుమారి, పరసా కామేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **గూడూరు** : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కోరారు. మండల పరిధిలోని మల్లవోలు, పోలవరం, ఐదుగుళ్ళపల్లి గ్రామాల్లో కృష్ణప్రసాద్ పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. పోతన స్వామి, బాసంశెట్టి శ్రీను, కోలపల్లి రజని, కాసగాని శ్రీను, అన్నం హరిరామకృష్ణ, పత్తిపాటి శ్రీనివాసరావు, చెడేపూడి ఏడుకొండలు, పోతుల రాము, కారుపర్తి మల్లి, బత్తిన వీరబాబు, కూనపరెడ్డి పాండు, బత్తిన బుజ్జి, మురాల నాని, ముద్దినేని కొండ, అల్లు బాల, సర్పంచ్ గోవాడ ప్రేమ్, గోవాడ అంజి, రాజశేఖర్, గుడివాడ మురళి, పిచ్చుక విజయ్, పాలగాని మహేష్, పూలనాగరాజు, గోపిశెట్టి శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజాను గెలిపించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిమార్ విజ్ఞప్తి చేశారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, యువనేత మం డలి వెంకట్రామ్‌లతో కలిసి సోమవారం మంగళాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చల్లపల్లి డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, రావెళ్ల విజయ్‌కుమార్, పరుచూరి కమలాకరరావు, పైడిపాముల స్వప్న, బోలెం నాగమణి, సూదాని నందగోపాల్, బొందలపాటి వీరబాబు, తూము కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ** : ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగుల మద్దతు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కేనని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ కోడ్ అనంతరం మెగా డీఎస్సీ ఖాయమన్నారు. **మోపిదేవి** : శాసనమండలి ఎన్నికల్లో అనుభవజ్ఞులైన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను మొదటి ప్రాధాన్యత ఓటుతోనే భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విజ్ఞప్తి చేశారు. పెదకళ్లేపల్లిలో పట్టభద్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, మత్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్** : మెగా డీస్సీ ద్వారా కూటమి ప్రభుత్వం 16 వేల టీచర్ల పోస్టులను త్వరలో భర్తీ చేయ బోతుందని, నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రె పాటి గోపీచంద్ అన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని చేకూర్చాలంటూ ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాల్లో గోపీచంద్, కూటమి నాయకులు ప్రచారం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌పై అవగాహన

చల్లపల్లి : ఎమ్మెల్సీ పోలింగ్‌పై నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈవో పి.వెంకటేశ్వరరావు, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. చల్లపల్లి రాజా కళాశాలలోని 189, 190 పోలింగ్‌బూత్‌లలో ఓటింగ్ నిర్వహిస్తారన్నారు. పోలింగ్ సిబ్బంది ఇచ్చిన పెన్నుతోనే బ్యాలెట్ పేపరుపై, తమకు నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా నెంబర్లు మాత్రమే వేయాలని వివరించారు.

దుర్గానాగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు 23 నుంచి

మోపిదేవి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీ పెదకళ్లేపల్లిలో దుర్గానాగేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. స్వామివారి కల్యాణ మహోత్సవం వాల్ పోస్టర్లు, కరపత్రాలు దేవస్థానం అర్చకుల సమక్షంలో ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయుటతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై మార్చి 1వ తేదీ రాత్రి 9 గంటలకు స్వామివారి పవళింపు సేవతో ముగుస్తాయని తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు వెంకట రమణ, చెన్నకేశవ, రామకృష్ణ, ప్రధాన అర్చకులు బుద్దు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈవో దాసరి శ్రీరామ వరప్రపసాదరావు

సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు 25 నుంచి

నాగాయలంక : సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు అర్చకులు కొల్లిపర శివసాయి తిరుమల భార్గవ్ అర్చకత్వంలో జరుగుతాయని ఈవో సిహెచ్.సుధాకరరావు తెలిపారు. భక్తులు విచ్చేసి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాల్సిందిగా కోరారు.



మదర్ థెరెసా జాతీయ సేవా పురస్కారం అందుకుంటున్న దాసరి విజయకుమార్

సర్పంచ్ విజయకుమార్‌కు జాతీయ సేవా పురస్కారం

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మదర్ థెరెసా విశిష్ట సేవా జాతీయ పురస్కారం అందుకోవటం ఎంతో ఆనందంగా ఉందని పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి విశ్వ ఆర్ట్స్ ఆధ్వర్యంలో విశిష్ట సేవలందించిన సర్పంచ్ దాసరి విజయకుమార్‌ను సంస్థ ప్రతినిధులు, ముఖ్యఅతిథులు అవార్డు అందజేసి సత్కరించారు. హైకోర్టు జడ్జి మధుసూదనరావు, డాక్టర్ వీరభోగ వసంతరాయులు, డాక్టర్ జె.ఎం.రాజేంద్ర, లైన్స్ స్మార్ట్ నేత డాక్టర్ బిక్కునాథ్; డాక్టర్ మోస్ ఆలీఖాన్, డాక్టర్ మాదాల నాగూర్ తదితరుల చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. డాక్టర్ ఆకుమల్ల నానికి కృతజ్ఞతలు తెలిపారు.

24 గంటల్లో గొలుసు రికవరీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గాంధీనగర్‌కు ఆకునూరి కోటేశ్వరరావు బంగారు గొలుసును పోగొట్టుకోగా ఫిర్యాదు అందుకున్న 24 గంటల్లో సీఐ నబీ రికవరీ చేసి అందజేశారు. ఆకునూరి కోటేశ్వరరావు ఆదివారం గాంధీనగర్‌లో బంగారు గొలుసు పోగొట్టుకున్నాడు.

చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిలకలపూడి సీఐ నబీ ఆధ్వర్యంలో సిసి కెమెరాలను పరిశీలించి స్థానికులను విచారించి పోగొట్టుకున్న గొలుసును అందజేశారు. ఎస్పీ ఆర్. గంగాధరరావు, డీఎస్పీ సిహెచ్. రాజా సీఐ నబి, హెడ్‌కానిస్టేబుల్ మల్లిని అభినందించారు.



మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలోని జనవాణిలో వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

హంసలదీవిలో టోల్ రుసుం వసూలు నిలిపి వేయాలి

కోడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి బీచ్ మార్గంలో పాలకాయితిప్ప వద్ద అటవీశాఖ అధికారులు టోల్‌రుసుం వసూలు నిలిపివేయాలని కోరుతూ జనసేన పార్టీ నేతలు సోమవారం వినతిపత్రం అందించారు. మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య ఆధ్వర్యంలో మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనవాణి కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేశారు. బీచ్ వద్ద పర్యాటకులకు ఎటువంటి వసతులు కల్పించకుండా టోల్ వసూలు చేయటం తగదన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం హంసలదీవి సాగర సంగమ ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధిపర్చాలని ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌ను కోరారు. జనసేన నాయకులు కోట రాంబాబు, సిద్ధినేని అశోక్ కుమార్, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి వెండి కిరీటం



అవనిగడ్డ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ వంతెన సెంటర్ ఆంజనేయస్వామికి సింహాద్రి భావన్నారాయణ-రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు సాహితీ చంద్ర రూ.70 వేల విలువైన వెండి కిరీటాన్ని సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ పురోహితులు స్వామివారికి కిరీటాన్ని అలంకరించారు. అవనిగడ్డ ప్రముఖులు బడే దానారావు, గంగు దేవరాజు, వడ్డీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఈడేపల్లి ఆలయంలో హోమాలు, ప్రసన్నాంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న బంగారుబాబు దంపతులు, విద్యాసాగర్

ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఈడేపల్లిలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం నిర్మించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమ వారం నూతనంగా స్వామి నల్లరాతి విగ్ర హాన్ని ప్రతిష్ఠించారు. వేదపండితులు రాళ్ళపల్లి అంజనేయ శాస్త్రి ఆధ్వర్యంలో పునః ప్రతిష్ఠ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నారాయణ హోమం నిర్వహించారు.

పాగోలులో ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

చల్లపల్లి : పాగోలు కైవల్యాశ్రమ చలాచలబోధోపదేశ మందిర ప్రాంగణంలో సాక్షి గణపతి, దత్తాత్రేయ, వ్యాస, శ్రీకృష్ణ, జగద్గురు ఆది శంకర సహిత పరివార దేవతలు, పంచముఖాంజనేయ, గరుత్మంతాది క్షేత్రపాలక సహిత కమలాత్మికా సహిత అచలేశ్వర పంచాయతన ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విద్యాసాగర్ గురూజీ పర్యవేక్షణలో డాక్టర్ వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని, వడ్లమాని కేదారశర్మ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం గోపూజ, విఘ్నేశ్వరపూజ, ప్రతిష్ఠా సంకల్పం, సప్తస్థలమాతృకాపూజ, సప్తమృతమాతృకాపూజ, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అంకురారోపణ, దశమహావిద్యా మూలమంత్ర జపాలు, సాయంత్రం యోగిని, వాస్తు, నవగ్రహ, క్షేత్రపాలక, సర్వతోభద్ర మండల ఆవాహన, వాస్తుహోమం, అగ్నిమధనం, శ్రీచక్ర నవావరణార్చన తదితర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ట్రస్టీ మేకా బంగారుబాబు, వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపతులు పూజా కార్యక్రమాలు జరిపారు. మేనేజింగ్ ట్రస్టీ చాపరా గాంధీప్రసాద్, ట్రస్టీ మేకా బంగారుబాబు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

జిల్లా స్థాయి భజన బృందాల సమావేశం 22న

మచిలీపట్నం : ఈనెల 22న ఉదయం 9 గంటలకు నిమ్మకూరులోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో భజన బృందాల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రతినిధి తురగా ప్రసాద్ తెలిపారు. భజన బృందాల గురువులు పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

కారుపర్తి రత్నంకు అభినందనలు

గూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా పోలవరం మాజీ సర్పంచ్ కారుపర్తి రత్నం నియమితులయ్యారు. దేవాంగ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము - పులిగడ్డ

సవరణ

కృష్ణాజిల్లా, అవనిగడ్డ మండలం, పులిగడ్డ గ్రామపంచాయతీకి చెందిన టెండరు నోటీసు ది. 13-02-25న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించబడినది. MLC ఎలక్షన్ కోడ్ ఉన్నందున **ది. 19-02-25న స్వీకరించవలసిన టెండర్లను నిలిపివేయటం జరిగినది. MLC** ఎలక్షన్ అనంతరం మరల పబ్లికేషన్ ద్వారా తెలియజేయగలము. (సం) శ్రీమతి బి. అనిత, కార్యదర్శి, గ్రామ పంచాయతీ - పులిగడ్డ



GOLD FINANCE

బంగారం కొనబడును, బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకే తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర: 83338 33368

AJB -225796

ONE SITTING

Discontinued or ఫెయిలైన విద్యార్థులకు సం॥లో పాస్ అయ్యే అవకాశం. 10th / Inter / Degree / PG / Diploma/ B.Tech./ LLB / Certificate Courses, UGC Regd. Universities, Sri Sai Education, Kadapa, Cell : 98855 11226

AJC-224641

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి






పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా, సెల్ : 99854 01166

మచిలీపట్నం, పెడన : 99854 11610,
చల్లపల్లి : 99854 11331, గుడివాడ : 99854 09737,
ఉయ్యూరు, పామర్రు : 99854 09737

పీహెచ్‌సీ డాక్టర్లు నివేదికలు తక్షణం పంపాలి

● డీఐవో డాక్టర్ ప్రేమ్‌చంద్

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఏఎన్ఎంలు జ్వరాలపై నివేదికలను వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి పంపాలని డీఐవో డాక్టర్ ప్రేమ్‌చంద్ ఆదేశించారు. చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్ జి. లాస్యహరిత, ఎంపీహెచ్‌వో పి.వి. పరమేశ్వరరావు, భారతి, రాంబాబు, హుస్సేన్‌బి, సీతారామ్, రామ్‌నాయక్, ఏ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ : స్వర్ణమల్టీప్లెక్స్
మచిలీపట్నం : రామరాజు
గుడివాడ : బాలాజీ
మరియు మీ అభిమాన థియేటర్లలో...
యన్.టి.ఆర్. జిల్లా & కృష్ణాజిల్లా :
సంధ్య పిక్చర్స్ రిలీజ్, సెల్ : 99489 51999



దేశభద్రత తీర ప్రాంతీయులదే

నాగాయలంక, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశభద్రత తీర ప్రాంతంలోని పౌరులందరిదీ అని పాలకాయితిప్ప మెరైన్ పోలీసులు అన్నారు. పాలకాయితిప్ప మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ సురేష్ రెడ్డి ఉత్తర్వుల మేరకు సోమవారం నాగాయలంక మండలంలోని పాత ఉపకాలి, సంగమేశ్వరం, నాలి, దీనదయాళ్‌పురం, సొర్లగొంది గ్రామాలలో తీర ప్రాంత భద్రతపై మత్స్యకారులకు మెరైన్ సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు కొత్త వ్యక్తులు, కొత్త బోట్లు గాని కనపడితే 1093 కి తెలియజేయాలని మత్స్యకారులకు సూచించారు. కోడూరు మెరైన్ స్టేషన్ సిబ్బంది రెహమాన్, అలీ, నరసయ్య అవగాహన కల్పించారు.

ముంతాజ్‌బేగంకు కమిషనర్ అభినందన

మచిలపట్నం టౌన్ : గాంధీనగర్‌లో మిద్దెతోట పెం చుతున్న ముంతాజ్ బేగం నగర ప్రజలకు ఆదర్శమని మునిసిపల్ కమిషనరు బాపిరాజు అన్నారు. స్వచ్ఛత అవార్డునందుకున్న ముంతాజ్ బేగం ను సోమవారం ఆయన అభినం దించారు.



అంగన్వాడీ కార్యకర్తల ధర్నా

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సంఘ నాయకులు రమాదేవి తదితరులు మాట్లాడారు. **అవనిగడ్డ** : అవనిగడ్డ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్వాడీలు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంగన్వాడీల వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి రాజరత్నమ్మ, గంగాభవాని పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య మెరుగు పర్చాలి

గూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుద్యం మెరుగుకుపంచాయతీ కార్యదర్శులు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె. అరుణ ఆదేశించారు. మండల కార్యాలయంలో పారిశుద్యంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. చెత్త నుంచి సంపద సృష్టించడంపై ప్రజలకు కార్యదర్శులు అవగాహన కల్పించాలన్నారు. డీఎల్‌పీవో వి. సీతారామయ్య, ఎంపీడీవో బి. రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలి



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఆర్డీవో కె. స్వాతి పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్లతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఓటరుకు పోలింగ్ కేంద్రంలో పెన్ను ఇవ్వాలన్నారు. ఓటరు ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేస్తారన్నారు. పెడన మం డలంలో 2, ఘంటసాలలో 2, బంటుమిల్లిలో 2, కృత్తివెన్నులో 1, మచిలీపట్నంలో 12, గూడూరులో 1, చల్లపల్లిలో 2, మోపిదేవిలో 2, అవనిగడ్డలో 2, కోడూరులో 2, నాగాయలంకలో 1 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ఘంటసాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన సంఘటన ఘంటసాలపాలెం చాట్రగడ్డవానిగూడెంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. దళితవాడలోని సీబీసీఎన్‌సీ పాఠశాల పక్కన ఉపాధ్యాయుడు కె.సాల్మన్ రాజు ఒంటినిట్టాడి పూరిల్లు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నాడు. ఆదివారం ఉదయం ఉపాధ్యాయుడు సాల్మన్ రాజు విజయవాడ వెళ్లగా, అర్ధరాత్రి సమయంలో పూరిల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. విలువైన వస్తుసామాగ్రి, బట్టలు, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11610, 99854 11331

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రావులకొల్లు

గుడివాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర సమావేశాల్లో అధ్యక్షురాలిగా వేములపల్లి బేబీ రాణి, ప్రధాన కార్యదర్శిగా రావులకొల్లు వెంకటమల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అగస్తి ఆదివిష్ణు, అధికార ప్రతినిధిగా షేక్ సయ్యద్, రాష్ట్ర నాయకులుగా నైనవరపు శేషుబాబు, బోయిన సోమశేఖర్, దొండపాటి వెంకటకృష్ణారావు ఎన్నికయ్యారు.


నియామకపత్రాన్ని అందుకుంటున్న రావులకొల్లు మల్లేశ్వరరావు


వివరాలు తెలియజేస్తున్న శాస్త్రవేత్తలు సత్య ప్రియ లలిత, సుధారాణి

నేడు కిసాన్ మేళా

ఘంటసాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఘంటసాలలోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో మంగళవారం కిసాన్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.సత్య ప్రియ లలిత, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. వరి మాగాణుల్లో అపరాల సాగు - సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణ ప్రధాన అంశంగా ఈ మేళా జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. క్షేత్ర సందర్శన, వ్యవసాయ ప్రదర్శన, రైతు సదస్సు, అతిథుల ప్రసంగాలు, శాస్త్రవేత్తల సాంకేతిక సందేశాలు, శాస్త్రవేత్తలు - రైతుల చర్చాగోష్ఠి, వ్యవసాయ క్విజ్ నిర్వహిస్తామని తెలిపారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి, కలెక్టర్ డికె.బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పివి.సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారిణి ఎన్.పద్మావతి, సహపరిశోధనా సంచాలకులు డాక్టర్.ఎన్.వి.వి.ఎస్.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. రైతులు విరివిగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. శాస్త్రవేత్తలు వెంకటలక్ష్మీ, పద్మావతి, లహరి, రేవతి, మంజువాణి పాల్గొన్నారు.


మొవ్వలో ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు


పామర్రులో అంగన్వాడీ కార్యకర్తలకు మద్దతు తెలుపుతున్న సీఐటీయు, సీపీఎం నేతలు

కనీస వేతనాలు చెల్లించాలి

● గ్రాట్యుటీ అమలు చేయాలి ● మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలి ● గుడివాడ, మొవ్వ, పామర్రులో అంగన్వాడీల ధర్నా

కూచిపూడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మొవ్వ సీడీపీవో కార్యాలయం ఎదుట సోమవారం అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తూ జీవో ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 164 సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన విధివిధానాలు రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీవో సుధారాణికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ నేతలు ఎస్.విజయలక్ష్మి, రాజారత్నం, గంగాభవాని, వేమూరి లక్ష్మి, తాతా శివకుమారి, పద్మజ, నాగమల్లేశ్వరి తదితరులతోపాటు మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల మండలాలకు చెందిన అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ స్త్రీ, శిశుసంక్షేమ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షకార్యదర్శులు వైగీత, టి.వాణి మాట్లాడుతూ, కనీస వేతనం అమలు, గ్రాట్యూటీ, మినీ సెంటర్‌లను ప్రధాన కేంద్రాలకు మారుస్తూ జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలన్నారు. సీఐటీయూ నాయకులు ఆర్సీపీ రెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు అమ్మాజీ, రమాదేవి, నిర్మలజ్యోతి, మేరీ కుమారి, సుగుణ, వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మీ, త్రివేణి పాల్గొన్నారు.

పామర్రు: అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని పామర్రు డివిజన్ సీపీఎం, సీఐటీయూ నేతలు కాటూరి నాగభూషణం, ఒడుగు గంగాధర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సంఘం నేత కొడాలి ఉమారాణి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పద్మ, చిన్నారి, ముళ్లపూడి విల్సన్ పాల్గొన్నారు.


రవికుమార్‌ను సత్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుడివాడ ఇన్‌ఛార్జి డీవైఈవోగా కొండా

గన్నవరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):గన్నవరం మండల ఎంఈవోగా పని చేస్తున్న కొండా రవికుమార్‌కు గుడివాడ డీవైఈవోగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు సోమవారం ఇచ్చారు. ప్రస్తుతం గన్నవరంతో పాటు ఉంగుటూరు మండలాలకు ఎంఈవోగా పని చేస్తున్నారు. ఇన్‌ఛార్జి డీవైఈవోగా బాధ్యతలు రావటంతో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో దుశ్శాలువ, పూలబొకేలతో సత్కరించారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వరప్రసాద్, మండల కార్యదర్శి జి.రాజాబాబు, టి.శ్రీనివాస్, వరప్రసాద్, డి.శ్రీనివాస్, వీవీ బాలస్వామి, జె.కుమారిలు సత్కరించిన వారిలో ఉన్నారు. ఎస్టీయు రాష్ట్రకార్యదర్శి విద్యాసాగర్ ఆధ్వర్యంలో కూడా రవికుమార్‌ను సత్కరించారు.

22న జిల్లా స్థాయి భజన బృందాల సమావేశం

పామర్రు :తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న ఉదయం 9 గంటలకు నిమ్మకూరు గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో జిల్లాలోని వివిధ భజన బృందాల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రతినిధి తురగా ప్రసాద్ తెలిపారు. భజన బృందాలకు చెందిన గురువులు పాల్గొని భవిష్యత్తులోనిర్వహించే కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. వివరాలకు 9849068424కు సంప్రదించాలన్నారు.



చెత్తనుంచి సంపద తయారు చేసే కేంద్రం

అలంకారప్రాయంగా సంపద కేంద్రాలు

● నిలువెత్తు నిర్లక్ష్యానికి సాక్ష్యాలు
● ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాని వైనం

(ఆంధ్రజ్యోతి - పమిడిముక్కల) : ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో చేపట్టిన సంపద తయారీ కేంద్రాలు నిర్లక్ష్యానికి నిదర్శనంగా కన్పిస్తున్నాయి. గ్రామాల్లో సేకరించిన తడి పొడి చెత్తను సంపదగా మార్చే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు లక్ష్యానికి దూరంగా నిరుపయోగంగా ఉంటున్నాయి. మండల పరిధి గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ఏర్పాటుకు లక్షల రూపాయలు ఖర్చు చేసి అవసరమైన షెడ్లు వేసి సంవత్సరాలు గడుస్తున్నా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. ఇప్పటి వరకు వృథాగానే పడి ఉన్నాయి. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుని గ్రామా లలో పరిశుభ్రతకు తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించి, సంపద తయారే చేయాలని ఆదేశించింది. పలు గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలు అలంకార ప్రాయంగా మారాయి. ఉన్నతాదికారులు ఆకస్మిక తనిఖీ చేస్తారేమో అని కొన్ని చోట్ల మొక్కుబడిగా పశువుల కంపోస్టు పోసి ఉంచడం గమనార్హం.


సంపద తయారీ కేంద్రంలో కొబ్బరిబొండాల డెక్కలు


సంపద తయారీ కేంద్రంలో ప్లాస్టిక్ బాటిళ్లు


సంపద తయారీ కేంద్రం లోపల ఖాళీగా ఉన్న కంపార్ట్‌మెంట్‌లు

వైభవంగా ఆంజనేయస్వామి శిఖర ప్రతిష్ఠ

కూచిపూడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కోసూరులో వీరాంజనేయ స్వామివారి విగ్రహ, ఆలయ శిఖర ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, హోమాది కార్యక్రమాలు, పూర్ణాహుతి, కలశ స్థాపన, సీతారాముల కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన జరిగింది.


శిఖర ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

త్రివేణి విద్యార్థి ప్రతిభ

గుడివాడ : పర్వతనేని జగన్మోహనరావు 20వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 10కె రన్‌లో త్రివేణి విద్యార్థి కె.గౌతమ్ ఉత్తమ ప్రతిభ కనబరచి నగదు, ప్రశంసాపత్రం అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ నిమ్మగడ్డ శివశంకర్ తెలిపారు. ప్రతిభ కనబరచిన గౌతమ్‌ను డైరెక్టర్ శివశంకర్, ఉపాధ్యాయులు, అభినందించారు.


గౌతమ్‌ను అభినందిస్తున్న శివశంకర్

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE
బంగారం కొనబడును, బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర: 83338 33368
AJB -225796

ONE SITTING
Discontinued or ఫెయిలైన విద్యార్థులకు సం॥లో పాస్ అయ్యే అవకాశం. 10th / Inter / Degree / PG / Diploma/ B.Tech./ LLB / Certificate Courses, UGC Regd. Universities, Sri Sai Education, Kadapa, Cell : 98855 11226
AJC-224641

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మింపబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ॥ 220/- కలర్ 30% EXTRA
మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464 తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీడీవో బీవై.విష్ణుప్రసాద్

తాగునీరు, ఉపాధి హామీ పథకం పనులకే ప్రాధాన్యం : ఎంపీడీవో

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీరు, ఉపాధి హామీ పథకం పనులకు అత్యంత ప్రాముఖ్యతనివ్వాలని ఎంపీడీవో బీ.వై.విష్ణు ప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం ఎంపీడీవో అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కార్యదర్శులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకం పనులు చేయాలని ఆయన కోరారు. కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రతతోపాటు వైద్యం విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, ఈవో పీఆర్‌డి ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగాలి

● జేఎన్టీయూ వైస్‌చాన్సలర్ మురళీకృష్ణ

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : భారతీయ విద్యార్థుల మేధస్సు అమోఘమని, అగ్రదేశాలు భారతీయ విద్యార్థులను ఎంతో గౌరవిస్తాయని కాకినాడ జేఎన్టీ యూ ఉపకులపతి కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ పేర్కొన్నారు. గుడ్లవల్లేరు ఇంజనీరంగ్ కళాశాలలో జాయ్ ఆఫ్ ఇంజనీరింగ్‌పై మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యకర్యమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దాదాపు ఏడు గంటల పాటు నిర్విరామంగా ఆయన చైతన్యవంతమైన ప్రసంగం చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగాలన్నారు. మద్యం, మాదక ద్రవ్యాలు, ధూమపానం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. మొదటి సెమిస్టర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మురళీకృష్ణ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండరామారావు, ఎం.ఆర్.సిహెచ్ శాస్త్రి, డైరెక్టర్ జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి ప్రసాద్, యాజమాన్య సలహాదారు పొట్లూరి రవీంద్రబాబు పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న మురళీకృష్ణ


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నేతలు


ఉపాధ్యాయులను ఓట్లు అడుగుతున్న వర్ల చాణక్య

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిని గెలిపిద్దాం

గుడివాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. మాంటిస్సోరి, టౌన్ హైస్కూల్, తదితర విద్యాసంస్థల్లో ఆలపాటికి ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ వెనిగండ్ల ప్రచారం నిర్వహించారు. ఆలపాటి లాంటి మంచివ్యక్తి ఎమ్మెల్సీగా ఉంటే పెద్దల సభకు గౌరవం పెరుగుతుందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులకు ఆయన అండగా ఉంటారన్నారు. నియోజకవర్గ పరిశీలకురాలు నూకాలమ్మ, టీడీపీ నాయకులు దింట్యాల రాంబాబు, శ్రీధర్, మాంటిస్సోరి పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, టౌన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పామర్రు,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): కూటమి బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తోనే యువతకు బంగారు భవిష్యత్తు సాధ్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహణపై జనసేన నేతలతో విజయవాడలో జరిగిన సమావేశానికి పామర్రు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ హాజరయ్యారు. ఆలపాటి విజయం కోసం అనుసరించే వ్యూహాత్మక విధివిధానాలపై నాదెండ్ల దిశానిర్దేశం చేసినట్లు నరేష్ తెలిపారు.

పెదపారుపూడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : శాసనమండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ, ఎన్నికల పరిశీలకులు విజయ్ కుమార్ నేతృత్వంలో మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో సోమవారం యలమర్రులో పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షుడుసూరపనేని వెంకట సత్యనారాయణ ఇ ఓటర్లను కలసి ఓట్లు అభ్యర్థించారు. వర్ల చాణిక్య, వర్ల చైతన్య, మనిముక్కు రాంబాబు, నీటి సంఘం అధ్యక్షుడు కూచిపూడి శ్రీనివాసరావు, గొరిపర్తి రవికుమార్, చెరుకూరి రమేష్, చెరుకూరి విజయ్ కుమార్, చప్పిడి కిషోర్, సీనియర్ నాయకులు ఆంజనేయులు, నత్తా వాణి, చిలక ఆంజనేయులు, చిలక ధనరాజ్, కాటన్ ధనరాజు, కోగంటి మధు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రతి ఉపాధ్యాయుడు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ సోమవారం తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోదరుడు వర్ల చాణక్య ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ మూడే శివశంకర్, మండల తెలుగురైతు అధ్యక్షుడు నెక్కలపూడి మురళీ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గోపయ్య, వల్లూరు రాంబాబు పాల్గొన్నారు.

పమిడిముక్కల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని టీడీ పీ నాయకుడు మైనేని నరేంద్ర అన్నారు. రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా సోమవార ం పమడిముక్కల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. క్రమశిక్షణ కలిగిన నాయకుడు ఆలపాటిని గెలిపిస్తే ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ఇమడా బత్తుల వెంకటేశ్వ రరావు, అంజి, బి.లక్ష్మీనారాయణ, ఇంటూరి రమేష్, జిల్లా నాయి బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు ఆముదాలపల్లి గోపాలకృష్ణ తదితరులు పాల్గొని రాజేంద్రప్రసాద్ తరపున విస్తృత ప్రచారం చేశారు.





ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
© 99854 09737, 99854 11610

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
© సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234